మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

ఆదివారం SUNDAY 9-8-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 | సంచిక: 41 Issue: 41

09 ఆగస్టు 2026 - ఆదివారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - గ్రీష్మ ఋతువు ఆషాఢ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:01 సూర్యాస్తమయం - సా. 6:41 తిథి ఏకాదశి ఉ. 11:04 వరకు తరువాత ద్వాదశి సంస్కృత వారం భాను వాసరః నక్షత్రం మృగశిర మ. 2:40 వరకు తరువాత ఆరుద్ర యోగం హర్షణ రా. 1:59ం వరకు కరణం భాలవ ఉ. 11:04 వరకు కౌలవ రా. 9:32 వరకు వర్జ్యం రా. 10:19 నుండి రా. 11:46 వరకు దుర్ముహూర్తం సా. 5:00 నుండి సా. 5:51 వరకు రాహుకాలం సా. 5:06 నుండి సా. 6:41 వరకు యమగండం మ. 12:21 నుండి మ. 1:56 వరకు గుళికాకాలం మ. 3:31 నుండి సా. 5:06 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:25 నుండి తె. 5:13 వరకు అమృత ఘడియలు ఉ. 6:41 నుండి ఉ. 8:08 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:56 నుండి మ. 12:46 వరకు గమనిక: "ం" అనగా మరుసటి

Circulated to Telangana
Published from Jagitial





## విద్యార్థులకు గోసలు!

### శ్రీ చైతన్య ఇంటర్ విద్యార్థి సూసైడ్

**ఫీజు కట్టలేదని కాలేజీ సిబ్బంది వేధింపులు**

**మనస్తాపంతో విద్యార్థి ఉరేసుకొని ఆత్మహత్య**

కాకినాడ, ఆగస్టు 8(ఈవార్తలు): స్థానిక శ్రీచైతన్య జూనియర్ కళాశాల సిబ్బంది వ్యాఖ్యలతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ ఇంటర్ విద్యార్థి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాకినాడ జగన్నాథపురంలోని జె.రామారావుపేట సమ్మెటవారి వీధికి చెందిన పైలా రాంబాబు, జ్యోతి దంపతుల రెండో కుమారుడు పైలా అరవింద్ (15) స్థానికంగా ఉన్న శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నాడు. శుక్రవారం అరవింద్, అతడి తండ్రి మొదటి టర్మ్ ఫీజు కట్టేందుకు కళాశాలకు వెళ్లినప్పుడు.. చాలామంది సెకండ్ టర్మ్ కూడా కట్టేశారని, మీరు ఇంకా మొదటి టర్మ్ ఫీజే కట్టలేదని సిబ్బంది అనడంతో వారు తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. శుక్రవారం రాత్రి ఇంటి తరువాయి 2 వ పేజీలో...





## అధికారులకు బాధలు!

### ఆమ్రపాలి, స్మిత సబర్వాల్ గప్‌చుప్?

**ఒకప్పుడు కీలక బాధ్యతలు.. ఇప్పుడు అప్రాధాన్యత పోస్టింగులు**

తెలుగు రాష్ట్రాల పాలనా వ్యవస్థలో తమదైన ముద్ర వేసుకున్న ఇద్దరు సీనియర్ ఐఏఎస్ అధికారులు ఇప్పుడు పరిపాలనలో పెద్దగా కనిపించకపోవడం అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఆంధ్రప్రదేశ్‌లో కాట ఆమ్రపాలి, తెలంగాణలో స్మితా సబర్వాల్ ఒకప్పుడు అత్యంత చురుకైన, సమర్థులైన అధికారులుగా గుర్తింపు పొందారు.

హైదరాబాద్, ఆగస్టు 8 (ఈవార్తలు): కీలక బాధ్యతలు అప్పగించినప్పుడు వేగంగా నిర్ణయాలు తీసుకోవడం, వినూత్న ఆలోచనలతో కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడం ద్వారా ఇద్దరూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. అయితే కాలం మారింది. ప్రభుత్వాలు మారాయి. పాలనా ప్రాధాన్యతలు మారాయి. ఈ క్రమంలోనే ఈ ఇద్దరు అధికారుల కెరీర్ కూడా అనూహ్య మలుపు తిరిగింది. ఒకప్పుడు కీలక నిర్ణయాల కేంద్రంగా ఉన్న అధికారులు ఇప్పుడు ఎందుకు తరువాయి 2 వ పేజీలో...



## 'పెద్ది' కుటుంబానికి రూ.2.25 కోట్లు

### ప్రకటించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

హైదరాబాద్, ఆగస్టు 8 (ఈవార్తలు): బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్.. 'పెద్ది' కుటుంబానికి పెద్ద దిక్కుగా నిలిచారు. ఇటీవల నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మృతిచెందగా.. ఆయన కుటుంబానికి పార్టీ తరపున రూ.2 కోట్ల 25 లక్షలను కేసీఆర్ ప్రకటించారు. పార్టీ సీనియర్లు, వరంగల్ జిల్లా ముఖ్య నేతలతో చర్చించి కేసీఆర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. సుదర్శన్ రెడ్డి ఇద్దరు పిల్లలకు తరువాయి 2 వ పేజీలో...

## వరికి నీళ్లివ్వలేం!

### తాగడానికే సాగర్ నీళ్లు.. పైనుంచి వచ్చే నీళ్లు లేవ్



### ఎల్‌నినో ఇంకెట్లుంటదో

**ఆరుతడి పంటలే వేయాలి.. మంత్రి కోమటిరెడ్డి వెల్లడి**

ఎల్‌నినో కారణంగా ప్రస్తుతం నాగార్జునసాగర్ ప్రాజెక్టులో ఉన్న నీరు తాగునీటికే సరిపోతుందని, అంతేకాక పైనుంచి నీరు వచ్చే అవకాశం కూడా లేనందున రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ వరి వేయకుండా ఆరుతడి పంటలు వేసుకునేలా అవగాహన కల్పించాలని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఒకవేళ నాగార్జునసాగర్ నిండినప్పటికీ చెరువులు నింపే పరిస్థితి లేదని, ఇప్పటికే బోర్లలో కూడా గ్రౌండ్ వాటర్ తగ్గిపోతున్నందున కష్టకాలంలో అధికారులు, ప్రజాప్రతినిధులు రైతులకు అండగా నిలబడి ఆరుతడి పంటలు వేసుకునేలా చూడాల్సిన అవసరం ఉందని అన్నారు.

నల్లగొండ, ఆగస్టు 8 (ఈవార్తలు): శనివారం నల్లగొండ జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ.. ప్రస్తుతం నాగార్జునసాగర్ ప్రాజెక్టులో నీరు డెడ్‌స్టోరేజీలో ఉందని, శ్రీశైలం నుంచి నీరు వచ్చినప్పటికీ పంటలకు సాగునీరు ఇచ్చే పరిస్థితి లేదని, ఉన్న నీరు జూన్ 2027 వరకు తాగునీటికే సరిపోతుందని తెలిపారు. వీటన్నింటినీ దృష్టిలో తరువాయి 2 వ పేజీలో...



## కల్వకుర్తి పంపులు ఆన్

**ప్రతి రోజు 800 క్యూసెక్కుల లిఫ్ట్ .. బీఆర్ఎస్ అల్టిమేటం ఎఫెక్ట్?**

మహబూబ్‌నగర్, ఆగస్టు 8 (ఈవార్తలు): కృష్ణా నదిలో భారీగా వరద ప్రవాహం కొనసాగుతున్నప్పటికీ మహబూబ్‌నగర్ జిల్లాలోని కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు, పాలమూరు–రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పంపులను ప్రభుత్వం వారం రోజులుగా ఆన్ చేయలేదని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. దీంతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో తాగునీరు,సాగునీటి కోసం ప్రజలు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు పేర్కొన్నారు. పంపులను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచారు. ఆగస్టు 11లోగా పంపులు ఆన్ చేయకపోతే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాయకత్వంలో నార్లాపూర్ పంప్‌హౌస్ వద్దకు చేరుకుంటామని మాజీ తరువాయి 2 వ పేజీలో...



### బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,235 |
| వెండి (కిలో): | రూ.2,49,900 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,345 |

## మీ మనసు నాకేం తెలుసు?

**నేనేం బాబా బాగేశ్వర్‌ను కాదు**

**విద్యార్థుల మదిలో ఎన్నో లక్ష్యాలు**

**ఐఐటీ– ఢిల్లీ స్నాతకోత్సవంలో మోదీ**

ప్రపంచం వేగంగా మారుతోంది.. టెక్నాలజీతో పాటు ఉద్యోగాలు, పరిశ్రమలు కూడా కొత్త రూపం దాలుస్తున్నాయని మోదీ అన్నారు. ఈ ప్రయాణంలో ఎప్పటికప్పుడు నేర్చుకుంటూ ఉండేవారే భవిష్యత్తులో విజయం సాధిస్తారని అన్నారు. శనివారం ఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) స్నాతకోత్సవంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మధ్యప్రదేశ్‌కు చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక గురువు బాబా బాగేశ్వర్ (ధీరేంద్ర కృష్ణ శాస్త్రి) పేరును ప్రస్తావించి సభలో నవ్వులు పూయించారు.



న్యూఢిల్లీ:విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, వారి మనసులోని ఆలోచనలను సరదాగా ఊహించి చెప్పారు. "మీరంతా ఈ రోజు ఇక్కడ సమావేశమయ్యారు. కానీ, మీ మనసుల్లో ఎన్నో ఆలోచనలు మెదులుతూ ఉంటాయి. నేనేం బాబా బాగేశ్వర్‌ను కాదు, కానీ మీ మదిలో తరువాయి 2 వ పేజీలో...

## ఏఐ ఊచ'కోత'

**2026లో 1.63 లక్షల టెక్ కొలువులు ఉఫ్**

**ఏఐ దెబ్బతో 91,215 ఉద్యోగాలు గాయబ్**

**భారత్‌లోనూ పెరుగుతున్న ప్రభావం**



ప్రపంచ సాంకేతిక రంగంలో ఉద్యోగాల కోతలు ఆందోళనకర స్థాయిలో కొనసాగుతున్నాయి. 2026లో ఇప్పటివరకు టెక్నాలజీ కంపెనీలు 1,63,427 ఉద్యోగాలను తొలగించినట్లు 'ట్రేడింగ్‌ప్లాట్‌ఫామ్స్' నివేదిక వెల్లడించింది. ఇందులో ఏకంగా 91,215 ఉద్యోగాల కోతలకు కృత్రిమ మేధనే ప్రధాన కారణంగా పేర్కొనడం గమనార్హం.

న్యూఢిల్లీ: కంపెనీలు కృత్రిమ మేధ ఆధారిత వ్యవస్థలపై పెట్టుబడులు పెంచుతూ.. సంప్రదాయ ఉద్యోగాల సంఖ్యను తగ్గిస్తున్నాయి. దీంతో సాంకేతిక రంగంలో ఉద్యోగ భద్రతపై ఆందోళనలు పెరుగుతున్నాయి. విభాగాల వారీగా చూస్తే క్లౌడ్, సాస్ రంగంలో అత్యధికంగా 37, ఓ492 ఉద్యోగాలు తగ్గాయి. ఈ–కామర్స్, మార్కెట్‌ప్లేస్ విభాగాల్లో 22,633, ఐటీ సేవల్లో 16,756, సామాజిక మాధ్యమాల విభాగంలో 13,592 ఉద్యోగాలు కోతకు గురయ్యాయి. తరువాయి 2 వ పేజీలో...

### విశ్వవాణి



భవిష్యత్తులో సంతానోత్పత్తి విధానాలను పూర్తిగా మార్చగల సాంకేతికతలపై శాస్త్రవేత్తలు పరిశోధనలు చేస్తున్నారు. సాధారణ శరీర కణాలైన చర్మ కణాల నుంచి అండాలు లేదా వీర్యకణాలను తయారు చేయడమే లక్ష్యంగా 'ఇన్ విట్రో గామెటోజెనెసిస్' విధానాన్ని అభివృద్ధి చేస్తున్నారు. ఈ పద్ధతి ద్వారా సాధారణ శరీర కణాలను ప్రయోగశాలలో ప్రత్యేక విధానాల ద్వారా పునరుత్పత్తి కణాలుగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నారు. అంటే ప్రస్తుతం అండాలు లేదా వీర్యకణాలను ఉత్పత్తి చేయలేని వ్యక్తుల శరీర కణాల నుంచి వాటిని రూపొందిస్తారన్న మాట.




## ఉద్యోగం పోతే గెంటేస్తాం

### హెచ్1బీ వీసాదారులకు అమెరికా షాక్

**60 రోజుల గ్రేస్ పీరియడ్ తొలగించే ప్రతిపాదనం.. భారతీయ ఉద్యోగులపై ప్రభావం**

వాషింగ్టన్: అమెరికాలో ఉద్యోగాలు చేస్తున్న విదేశీయులకు.. ప్రస్తుతం ఉన్న 60 రోజుల గ్రేస్ పీరియడ్‌ను తొలగించే ప్రతిపాదనను అక్కడి ప్రభుత్వం పరిశీలిస్తోంది. సాధారణంగా.. కొన్ని నాన్ ఇమిగ్రెంట్ వీసాలపై ఉన్న ఉద్యోగి తన ఉద్యోగాన్ని కోల్పోతే, వెంటనే అమెరికా నుంచి వెళ్లాల్సిన అవసరం లేదు. కొత్త ఉద్యోగం వెతుక్కోవడానికి 60 రోజుల వరకు సమయం ఉంటుంది. కానీ.. కొత్త తరువాయి 2 వ పేజీలో...

## కెనడా నుంచి గెంటేశారు

**తొలి ఆర్నెల్లలో 3,323 మంది భారతీయుల బహిష్కరణ**

**ఇంకో జాబితాలో మరో 7,669 మంది ఇండియన్స్**



ఒట్టావా: కెనడాలో నివసిస్తున్న భారతీయులకు ఆందోళన కలిగించే విషయం వెలుగులోకి వచ్చింది. ఈ ఏడాది తొలి ఆరు నెలల్లోనే కెనడా ప్రభుత్వం ఏకంగా 3,323 మంది భారత పౌరులను దేశం నుంచి బహిష్కరించింది. ఈ సంఖ్య గత ఆరేళ్ల రికార్డులను మించిపోయేలా ఉండటం గమనార్హం. కెనడా బోర్డర్ సర్వీసెస్ ఏజెన్సీ (సీబీఎస్ఏ) విడుదల చేసిన అధికారిక గణాంకాల ప్రకారం ఈ వివరాలు వెల్లడయ్యాయి. 2025 ఏడాది మొత్తంలో 3,779 మంది భారతీయులను బహిష్కరించగా, ఈ ఏడాది కేవలం ఆరు నెలల్లోనే ఆ సంఖ్యలో దాదాపు 88 శాతానికి చేరుకోవడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. వలస నిబంధనలను కఠినతరం చేస్తున్న నేపథ్యంలోనే ఈ బహిష్కరణలు తరువాయి 2 వ పేజీలో...



## రెంట్‌కు బాయ్‌ఫ్రెండ్!

**యువతులే లక్ష్యంగా కొత్త సైబర్ మోసం**

**ఆకర్షణీయమైన ప్యాకేజీలు.. అడ్వాన్స్ వసూళ్లు**

**డబ్బులు తీసుకున్నాక అకౌంట్లు బ్లాక్: సజ్జనార్**

హైదరాబాద్, ఆగస్టు 8 (ఈవార్తలు): సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న 'రెంట్ బాయ్‌ఫ్రెండ్' (అద్దెకు బాయ్‌ఫ్రెండ్) ప్రకటనల పట్ల యువతులు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు

9.8.2026

మేషం: చేపట్టిన పనులు సకాలంలో పూర్తిచేస్తారు. నూతన వస్తు, వస్త్రలాభాలు పొందుతారు. చిన్ననాటి మిత్రులతో కలుసుకుని విందు వినోదాది కార్యక్రమాలలో పాల్గొంటారు. స్థిరాస్తి వ్యవహారంలో వివాదాలు సర్దుమణుగుతాయి. వ్యాపారాలు మరింత నిదానంగా సాగుతాయి. ఉద్యోగాలలో పని ఒత్తిడి నుండి ఉపశమనం పొందుతారు.

వృషభం: ముఖ్యమైన పనులు మందకొడిగా సాగుతాయి. అధిక కష్టంతో అల్ప ఫలితం పొందుతారు. సోదరులతో భూవివాదాలు కలుగుతాయి. బంధువర్గంతో అకారణంగా వివాదాలు కలుగుతాయి. దైవ సేవా కార్యక్రమాలపై దృష్టి సారిస్తారు. వ్యాపారమున కొన్ని నిర్ణయాలు నష్టాలు కలిగిస్తాయి. ఉద్యోగాలలో అదనపు పనిభారం తప్పదు.

మిధునం: కుటుంబ వ్యవహారాలలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు. సోదరులతో స్థిరాస్తి ఒప్పందాలు చేసుకుంటారు. దూరపు బంధువుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. భాగస్వామ్య వ్యాపారాలకు సకాలంలో పెట్టుబడులు అందుతాయి. ఉద్యోగ వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది.

కర్కాటకం: సన్నిహితుల నుండి ఆర్ధిక ఒత్తిడి పెరుగుతుంది. ఇంటా బయట గందరగోళ పరిస్థితులు ఉంటాయి. దూర ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. కుటుంబ సభ్యులతో వివాదాలు కలుగుతాయి. అనారోగ్య సమస్యలు చికాకు పరుస్తాయి. ఉద్యోగాలలో ప్రతికూల వాతావరణం ఉంటుంది. వృత్తి వ్యాపారాలు నిరుత్సాహపరుస్తాయి.

సింహం: ముఖ్యమైన వ్యవహారాలు నిదానంగా పూర్తిచేస్తారు. కుటుంబ సభ్యుల నుంచి ఆశించిన ధన సహాయం అందుతుంది. సోదరులతో కుటుంబ విషయాల గురించి చర్చిస్తారు. దూరపు బంధువుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. వ్యాపారాలు లాభాల బాటలో పయనిస్తాయి. ఉద్యోగమున అధికారులతో వివాదాలు రాజీ అవుతాయి.

కన్య: రావలసిన సొమ్ము సకాలంలో వసూలవుతుంది. ఆత్మీయులతో గృహమున సంతోషంగా గడుపుతారు. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో విశేషంగా పాల్గొంటారు. చేపట్టిన పనులు అనుకున్న సమయానికి పూర్తి చేస్తారు. వృత్తి, వ్యాపారాలలో స్వంత నిర్ణయాలు అమలు చేసి లాభాలు అందుకుంటారు. ఉద్యోగస్తుల పనితీరుకు అధికారుల నుండి ప్రశంసలు అందుతాయి.

తుల: పాత ఋణాలు తీర్చడానికి నూతన ఋణప్రయత్నాలు చేస్తారు. బంధు మిత్రులతో స్వల్ప వివాదాలు కలుగుతాయి. కుటుంబ సభ్యులతో దైవదర్శనం చేసుకుంటారు. వ్యాపారాలలో తొందరపాటు నిర్ణయాలు తీసుకోవడం మంచిది కాదు. నిరుద్యోగ యత్నాలు నిరుత్సాహపరుస్తాయి. ఉద్యోగస్తులకు కష్టానికి తగిన ఫలితం అందదు.

వృశ్చికం: చేపట్టిన పనులు శ్రమాధిక్యతతో కానీ పూర్తికావు. కొన్ని విషయాలలో సోదరులతో వివాదాలు కలుగుతాయి. ఆర్థిక పరిస్థితి నిరాశ కలిగిస్తుంది. భూ సంబంధిత వివాదాలు కొంత ఒత్తిడి కలిగిస్తాయి. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చేయడం మంచిది కాదు. నూతన వ్యాపారాలు ప్రారంభానికి అవరోధాలు కలుగుతాయి. ఉద్యోగస్తులకు అధికారుల నుండి పని ఒత్తిడి పెరుగుతుంది.

ధనస్సు: సమాజంలో ప్రముఖులతో నూతన పరిచయాలు కలుగుతాయి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. రావలసిన డబ్బు సకాలంలో చేతికి అందుతుంది. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. వ్యాపార, ఉద్యోగాలలో అంచనాలు అందుతాయి.

మకరం: సంతాన విద్యా విషయాలపై దృష్టి సారిస్తారు. రాజకీయ వర్గాల ప్రముఖుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు. చేపట్టిన పనులలో శ్రమకు తగిన ఫలితం పొందుతారు. భూ సంభందిత క్రయ విక్రయాలు లాభసాటిగా సాగుతాయి. వ్యాపారాలు విస్తరిస్తాయి. ఉద్యోగాలలో ఉన్నత పదవులు పొందుతారు.

కుంభం: ముఖ్యమైన పనులు వాయిదా పడతాయి. ప్రయాణాలలో మార్గవరోదాలు కలుగుతాయి. వృధా ఖర్చులు పెరుగుతాయి. కుటుంబ సభ్యులతో ఊహించని వివాదాలు కలుగుతాయి. శారీరక మానసిక అనారోగ్య సమస్యలు చికాకు పరుస్తాయి. వ్యాపారాలు మందగిస్తాయి. ఉద్యోగ వాతావరణం చికాకు కలిగిస్తుంది.

మీనం: కుటుంబ సభ్యుల ప్రవర్తన కొంత చికాకు కలిగిస్తుంది. చేపట్టిన పనులలో వ్యయప్రయాసలు అధికమౌతాయి. సన్నిహితులతో ఊహించని వివాదాలు కలుగుతాయి. నిరుద్యోగ ప్రయత్నాలు నిరాశ కలిగిస్తాయి. చిన్ననాటి మిత్రులతో దైవదర్శనాలు చేసుకుంటారు. వృత్తి ఉద్యోగములు సామాన్యంగా సాగుతాయి.

# వరికి నీళ్లివ్వలేం!

మొదటి పేజీ తరువాయి

ఉంచుకొని రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలని కోరారు. ఏఎంఆర్‌పీ కూడా సగమే నిండిందని, గతంలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి లేదని మంత్రి అన్నారు. రాబోయే రోజుల్లో సూపర్ ఎల్‌నినో కారణంగా దక్షిణ తెలంగాణలో పరిస్థితులు ఎలా ఉంటాయో తెలియని పరిస్థితి నెలకొందని తెలిపారు. అందువల్ల అధికారులు, ప్రజాప్రతినిధులు రైతులు ఆరుతడి పంటలు వేసుకునేలా కష్టపడి పనిచేయాలని, ఇలాంటి కరువు పరిస్థితుల్లో రైతులకు అందరూ అండగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో పంట మార్పిడిలో భాగంగా 33 వేల ఎకరాల్లో వరికి బదులు ఆరుతడి పంటలు వేయడం జరిగిందని మంత్రి తెలిపారు. అయితే దీన్ని లక్షన్నర ఎకరాల లక్ష్యంగా తీసుకుని రైతులతో ఆరుతడి పంటలు వేయించాలని ఆదేశించారు. జిల్లాలో 9 వేల ట్రాన్స్‌ఫార్మర్లపై ఉన్న ఓవర్‌లోడ్‌ను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ముఖ్యమంత్రితో మాట్లాడి అవసరమైన విద్యుత్ సామగ్రిని తెప్పిస్తామన్నారు. కరువు వచ్చినప్పటికీ నల్లగొండ జిల్లాకు శాశ్వతంగా సాగునీరు అందించే ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులు ఆగస్టు 2028 నాటికి పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు. పనులు కొనసాగుతున్నాయని, ఏఎంఆర్‌పీ, ఎస్ఎల్‌బీసీ, బ్రాహ్మణ వెల్లెంల ద్వారా జిల్లాలో నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని అన్నారు. ఎస్ఎల్‌బీసీ కోసం ఎంతైనా ఖర్చు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశించారని తెలిపారు. కరువు వచ్చినా, శ్రీశైలం డెడ్‌స్టోరేజీలో ఉన్నప్పటికీ ఎస్ఎల్‌బీసీ నుంచి సాగునీరు అందించవచ్చన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి కష్టకాలంలో రైతులకు అండగా ఉండాలని, ప్రజలకు ధైర్యం చెప్పాలని, ఆరుతడి పంటలు వేసుకునే విధంగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఇకపై జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశాలను నిరంతరం నిర్వహించాలని సూచించారు. జిల్లాలోని వివిధ ప్రాజెక్టుల కింద రైతులు రెండు పంటలు వరి వేస్తున్నారని, దీనివల్ల భవిష్యత్తులో భూములు సారం కోల్పోయి ఎందుకూ పనికిరాకుండా పోతాయని మంత్రి అన్నారు. విపరీతంగా ఎరువులు వాడటం, నిరంతరం వరి సాగు చేయడం వల్ల భవిష్యత్తులో ఎలాంటి పంటలు వేసుకోలేని పరిస్థితి వస్తుందన్న విషయాన్ని రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఇందులో భాగంగా కూరగాయల పంటలు, ఉద్యాన పంటలు పండించాలని, ఆర్గానిక్ వ్యవసాయం చేసే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాకు 5 వేల యూనిట్ల స్ప్రింక్లర్లు కావాలని అధికారులు కోరగా.. తక్షణమే వాటిని మంజూరు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## కల్వకుర్తి పంపులు ఆన్

మొదటి పేజీ తరువాయి

మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డితో పాటు పాలమూరు, రంగారెడ్డి జిల్లాలకు చెందిన పలువురు బీఆర్ఎస్ నేతలు హెచ్చరించారు. బీఆర్ఎస్ నేతలు అల్టిమేటం ఇచ్చిన కొద్దిసేపటికే కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పరిధిలోని ఎల్లూరు, జొన్నలబొగడ, గుడిపల్లి పంప్‌హౌస్‌లలో ఇరిగేషన్ అధికారులు మోటార్లను ఆన్ చేశారు. కృష్ణా బ్యాక్‌వాటర్ నుంచి కల్వకుర్తి ఎత్తిపోతలను ప్రారంభించి ప్రతి రోజు 800 క్యూసెక్కుల నీటిని లిఫ్ట్ చేస్తున్నారు. కేఎల్ఐ లోని ఎల్లూరు పంప్‌హౌజ్ లో మొదటి పంప్ స్టార్ట్ చేసిన ఇంజినీరింగ్ ఆఫీసర్లు ఎల్లూరు రిజర్వాయర్‌నుంచి సింగోటం, జొన్నలబొగడ, గుడిపల్లిగట్టు రిజర్వాయర్లకు నీటిని ఎత్తిపోస్తున్నారు. దీంతో జిల్లాలో 4.50 లక్షల ఎకరాల పంటల సాగుపై ఆశలు చిగురిస్తున్నాయి. కానీ కేఎల్ఐ పరిధిలోని నాగర్ కర్నూల్, వనపర్తి, మహబూబ్ నగర్ జిల్లాల్లో ఆయకట్టుకు సాగునీరందించేందుకు నాలుగు రిజర్వాయర్లతో పాటు దాదాపు 800పైగా పెద్ద చెరువులు నింపాల్సి ఉంటుంది. కృష్ణా నదికి వరద మొదలైన వారం తర్వాత ఎల్లూరు మొదటి పంపును ప్రారంభించి రోజు 800 క్యూసెక్కుల నీటిని లిఫ్ట్ చేస్తున్నారు. తక్కువ వర్షపాతం నమోదైన ప్రాంతాల్లో కేఎల్ఐ కాల్వల ద్వారా సాగునీరందించేందుకు అవకాశాలున్నా.. అధికారులు రెండో పంప్ వినియోగంపై స్పందించడం లేదు. ఎల్లూరులో రెండు పంపుల ద్వారా 1600 క్యూసెక్కుల నీరు ఎత్తిపోస్తే తప్ప కల్వకుర్తి, అచ్చంపేట, వనపర్తి నియోజకవర్గాల్లోని చివరి ఆయకట్టుకు నీరు అందే పరిస్థితి ఉండదు. శ్రీశైలం రిజర్వాయర్ లో 850 అడుగుల వద్దకు నీరు చేరగానే ఏపీ వైపు పోతిరెడ్డిపాడు ఇతర ప్రాజెక్టులకు నీరు వదులుతున్నా.. తెలంగాణ వైపున్న కేఎల్ఐ వంటి మేజర్ ప్రాజెక్టు పరిధిలోని రిజర్వాయర్లు, చెరువులు నింపడంపై అటు ప్రజాప్రతినిధులు, ఇటు ఇంజినీరింగ్ ఆఫీసర్లు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

## ఉద్యోగం పోతే గెంటేస్తాం

మొదటి పేజీ తరువాయి

ప్రతిపాదన అమల్లోకి వస్తే ఉద్యోగం పోయిన వెంటనే యూఎస్ విడిచి వెళ్లాల్సి వస్తుంది. 60 రోజుల గ్రేస్ పీరియడ్‌ను తొలగించే ప్రతిపాదనను.. అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ తీసుకొచ్చింది. ప్రస్తుతం ఇది ఫెడరల్ ఆఫీస్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ బడ్జెట్ పరిశీలనలో ఉంది. నిజానికి.. 2017లో ఈ 60 రోజుల గ్రేస్ పీరియడ్‌ను తీసుకొచ్చారు. ఉద్యోగం కోల్పోయిన విదేశీ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు కొత్త ఉద్యోగం వెతుక్కోవడానికి ఇది ఉపయోగపడుతోంది. ప్రస్తుతం హెచ్-1బీతో పాటు ఈ-1, ఈ-2, ఈ-3, హెచ్-1బీ1, ఎల్-1, ఓ-1, టీఎన్ వంటి కొన్ని వీసా కేటగిరీలకు ఈ నిబంధన వర్తించే అవకాశం ఉంది. ఒకవేళ గ్రేస్ పీరియడ్‌ను తొలగిస్తే.. ఉద్యోగం కోల్పోయిన విదేశీ ఉద్యోగులు, వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులు వెంటనే అమెరికా విడిచి వెళ్లాల్సి వస్తుంది. ఉద్యోగం పోతే.. అక్కడే ఉండి కొత్త ఉద్యోగం వెతుక్కోవడం అంత సులభం కాదు. అలాగే.. అమెరికాలోనే ఉండి కొత్త కంపెనీకి మారడం లేదా వీసా స్టేటస్ మార్చుకోవడం కూడా ఇబ్బందికరంగా మారవచ్చు. అయితే.. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో యూఎస్సీఐఎస్ మినహాయింపు ఇచ్చే అవకాశం ఉంటుంది. ఈ ప్రతిపాదన భారతీయులపై ప్రభావం చూపనుంది. ఎందుకంటే.. అమెరికాలో హెచ్-1బీ వీసాల ద్వారా పనిచేస్తున్న వారిలో భారతీయులు కూడా పెద్ద సంఖ్యలో ఉన్నారు.

## మీ మనసు నాకేం తెలుసు?

మొదటి పేజీ తరువాయి

ఏముందో ఊహించగలను. కొందరు భవిష్యత్తు గురించి, మరికొందరు జీతాల గురించి, ఇంకొందరు కొత్త నగరంలో కొత్త జీవితం గురించి, మరికొందరు స్టార్టప్‌ల గురించి ఆలోచిస్తుండవచ్చు” అని మోదీ వ్యాఖ్యానించడంతో విద్యార్థులు, అధ్యాపకులు చప్పట్లతో హర్షం వ్యక్తం చేశారు. ఈ వేడుకలో 3,000 మందికి పైగా విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. “ఈ రోజు మీ కుటుంబ సభ్యులు ఎంత గర్వపడుతున్నారో, నేను కూడా మీ గురించి అంతే గర్విస్తున్నాను. మీరు కేవలం డిగ్రీలు అందుకోవట్లేదు, దేశం కోసం ఏదైనా సాధించాలనే కలను ముందుకు తీసుకెళుతున్నారు” అని విద్యార్థులను అభినందించారు. ప్రతి ఒక్కరి మార్గం, కలలు వేర్వేరుగా ఉన్నప్పటికీ, ఐఐటీలో చేరిన మొదటి రోజు నుంచి ఈ స్నాతకోత్సవం వరకు సాగిన ప్రయాణం ప్రతి ఒక్కరిలో సంతృప్తిని నింపుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా అకడమిక్స్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రెసిడెంట్స్ గోల్డ్ మెడల్, డైరెక్టర్స్ గోల్డ్ మెడల్ వంటి ప్రతిష్ఠాత్మక పురస్కారాలను ప్రధాని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన సరదాగా స్పందిస్తూ.. “ప్రతిభావంతులైన విద్యార్థుల్లో కొంతమంది ఆడపిల్లలు ఉంటే బాగుండేది. క్షమించాలి, కొందరు కాదు, చాలామంది ఉండాలి” అని వ్యాఖ్యానించడంతో సభలో మరోసారి నవ్వులు విరిశాయి. అనంతరం ఐఐటీ సోనిపట్ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన ‘పరం ప్రజ్ఞ’ అనే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత హై-పెర్ఫార్మెన్స్ సూపర్ కంప్యూటింగ్ కేంద్రాన్ని ప్రధాని వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సదుపాయం ఏఐ, డేటా సైన్స్, అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ రంగాల్లో ఐఐటీ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేస్తుందని భావిస్తున్నారు. జీవితంలో వెనక్కి తిరిగి చూసుకున్నప్పుడు క్యాంపస్ జీవితం, స్నేహితులు, గురువులు ఎప్పటికీ గుర్తుండిపోతారని మోదీ విద్యార్థులకు సూచించారు.

## ఏఐ ఊచ‘కోత’

మొదటి పేజీ తరువాయి

ఎంటర్‌ప్రైజ్ సాఫ్ట్‌వేర్ రంగంలో ప్రపంచవ్యాప్తంగా 13,308 ఉద్యోగాలు తొలగించగా.. వాటిలో 88.6 శాతం అమెరికా కంపెనీల్లోనే నమోదయ్యాయి. దేశాల వారీగా చూస్తే అమెరికా తర్వాత ఇజ్రాయెల్‌లో అత్యధిక ఉద్యోగాల కోతలు నమోదయ్యాయి. ఆ తర్వాత భారత్, సింగపూర్ ఉన్నాయి. ఏఐ ఆధారిత సేవలపై కంపెనీలు దృష్టి పెంచుతున్న కొద్దీ ఉద్యోగాల స్వరూపం మారుతోంది. ఇజ్రాయెల్‌కు చెందిన ‘మండే.కామ్’ జులై 22న తన ఉద్యోగుల్లో 20 శాతం, అంటే సుమారు 620 మందిని తగ్గించనున్నట్లు ప్రకటించింది. ఏఐ ఆధారిత సేవలపై మరింత దృష్టి పెట్టేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ వెల్లడించింది. 2026లో అత్యధిక ఉద్యోగాలను తగ్గించిన సంస్థగా ఒరాకిల్ నిలిచింది. జనవరి నుంచి వివిధ దశల్లో మొత్తం 25,254 ఉద్యోగాలను తగ్గించింది. అమెరికాతో పాటు భారత్, కెనడా, మెక్సికోలోనూ ఈ కోతల ప్రభావం కనిపించింది. అమెరికాలో సిస్కో 4,000 ఉద్యోగాలను, అమ్డాక్స్ 2,900, ఆటోడెస్క్ 1,000 ఉద్యోగాలను తొలగించాయి. కంపెనీలు ఏఐ వైపు వేగంగా మళ్లుతున్న నేపథ్యంలో ఉద్యోగాల కోతలను కొందరు పెట్టుబడిదారులు సానుకూలంగా చూస్తున్నారని నివేదిక పేర్కొంది. ఏఐపై పెట్టుబడులను పెంచుతూ ఉద్యోగుల సంఖ్యను తగ్గించడం సంస్థల వ్యయాలను నియంత్రించేందుకు దోహదపడుతుందనే అభిప్రాయం ఉంది. అయితే ఉద్యోగుల కోణంలో మాత్రం పరిస్థితి భిన్నంగా కనిపిస్తోంది. ఏఐ కొత్త ఉద్యోగాలను సృష్టించే అవకాశం ఉన్నప్పటికీ.. ప్రస్తుతం ఉన్న అనేక ఉద్యోగాల స్వరూపాన్ని మార్చడం లేదా వాటిని పూర్తిగా తొలగించే పరిస్థితిని కూడా తీసుకొస్తోంది. అందుకే రాబోయే రోజుల్లో టెక్ రంగానికి అసలు సవాలు ఉద్యోగాల సంఖ్యను కాపాడటం మాత్రమే కాదు.. ఏఐతో కలిసి పనిచేయగల నైపుణ్యాలతో ఉద్యోగులను సిద్ధం చేయడం.


## రెంట్‌కు బాయ్‌ఫ్రెండ్!

మొదటి పేజీ తరువాయి

సజ్జనార్ హెచ్చరించారు. మహిళలు, యువతులను లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు ఈ కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్నారని ఆయన స్పష్టం చేశారు. ఈ మోసపూరిత వ్యవహారానికి సంబంధించిన వివరాలను తన ‘ఎక్స్’ ఖాతా ద్వారా వెల్లడించారు. గంటపాటు కాఫీ మీటింగ్ కోసం రూ. 499, సినిమా డేట్ కోసం రూ. 1,249, షాపింగ్ కోసం రూ. 1,499, వివాహాలు, ఇతర శుభకార్యాలకు తోడుగా వచ్చేందుకు రూ. 1,999, రోజంతా అందుబాటులో ఉండేందుకు రూ. 4,499 అంటూ ఆకర్షణీయమైన ప్యాకేజీలతో కూడిన పోస్టర్లను ప్రచారం చేస్తున్నారని ఆయన తెలిపారు. ఇంటర్నెట్ నుంచి సేకరించిన లేదా ‘ఏఐ’ సాంకేతికతతో సృష్టించిన అందమైన యువకుల ఫోటోలను వాడుతూ, గోప్యత పాటిస్తామని నమ్మబలుకుతున్నారని పేర్కొన్నారు. ఈ ప్రకటనలను నమ్మి ఎవరైనా సంప్రదిస్తే, వారితో స్నేహంగా మాట్లాడి తొలుత అడ్వాన్స్ లేదా సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాలని డిమాండ్ చేస్తారని వివరించారు. డిజిటల్ వ్యాలెట్లు లేదా క్యూఆర్ కోడ్‌ల ద్వారా నగదు బదిలీ చేయించుకున్న వెంటనే బాధితుల ఖాతాలను బ్లాక్ చేస్తారని తెలిపారు. ఒకవేళ ఆన్‌లైన్‌లో పరిచయమైన వారిని నేరుగా కలిస్తే, వారి నుంచి బ్లాక్‌మెయిల్, బెదిరింపులు లేదా ఇతర భద్రతాపరమైన ప్రమాదాలు ఎదురయ్యే అవకాశం ఉందని కమిషనర్ హెచ్చరించారు. ఇలాంటి ఆఫర్లకు స్పందించవద్దని, ఎట్టిపరిస్థితుల్లోనూ ముందస్తుగా నగదు చెల్లించవద్దని సజ్జనార్ సూచించారు. తమ పిల్లల సోషల్ మీడియా కార్యకలాపాలపై తల్లిదండ్రులు నిరంతరం నిఘా ఉంచాలని కోరారు. ఎవరైనా ఈ మోసానికి గురైనా లేదా ఇటువంటి అనుమానాస్పద పోస్టులు గమనించినా వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు కాల్ చేయాలని లేదా సైబర్ క్రైమ్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ ప్రకటనలపై సైబర్ క్రైమ్ విభాగం ఇప్పటికే విచారణ ప్రారంభించిందని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## కెనడా నుంచి గెంటేశారు

మొదటి పేజీ తరువాయి



పెరిగినట్లు స్పష్టమవుతోంది. అంతర్జాతీయ విద్యార్థులు, తాత్కాలిక విదేశీ కార్మికుల సంఖ్యను తగ్గించుకునేందుకు కెనడా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న తరుణంలో ఈ డేటా ప్రాధాన్యం సంతరించుకుంది. ఇప్పటివరకు కెనడా నుంచి బహిష్కరణకు గురైన వారి జాబితాలో మెక్సికన్లు అగ్రస్థానంలో ఉండేవారు. కానీ, ఈ ఏడాది భారతీయులు వారిని అధిగమించారు. తొలి అర్ధభాగంలో 3,323 మంది భారతీయులను బహిష్కరించగా, మెక్సికన్ల సంఖ్య 1,573గా ఉంది. గత ఐదేళ్లుగా బహిష్కరణల జాబితాలో మెక్సికో మొదటి స్థానంలో, భారత్ రెండో స్థానంలో కొనసాగాయి. చివరిసారిగా 2020లో 1,424 మందితో భారతీయులు అగ్రస్థానంలో నిలిచారు. వలస నిబంధనలను పాటించకపోవడం, వీసా గడువు ముగిసినా అక్కడే ఉండిపోవడం, ఆశ్రయం కోసం చేసుకున్న దరఖాస్తులు తిరస్కరణకు గురవడం, వీసా మోసాలకు పాల్పడటం వంటి కారణాలతోనే కెనడా ప్రభుత్వం ఎక్కువగా బహిష్కరణ వేటు వేస్తున్నట్లు తెలుస్తోంది. సీబీఎస్ఏ డేటా ప్రకారం.. మరో 7,669 మంది భారతీయులు బహిష్కరణ ప్రక్రియ జాబితాలో ఉన్నారు. అంటే.. సమీప భవిష్యత్తులో వీరిని కూడా దేశం విడిచి వెళ్లాలని ఆదేశించే అవకాశం ఉంది.

## విద్యార్థులకు గోసలు!

మొదటి పేజీ తరువాయి

వద్ద ఎవరూ లేని సమయంలో అరవింద్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సిబ్బంది వేధింపుల వల్లే అరవింద్ చనిపోయాడని తల్లిదండ్రులు, బంధువులు కాలేజీపై దాడి చేశారు. కళాశాలలోకి చొచ్చుకు వెళ్ళి ఫర్నిచర్ ధ్వంసం చేశారు.తమ కొడుకు తనకు కావాలని, ఇబ్బందులు పెట్టి వాడి చావుకు కారణం అయ్యారని తల్లిదండ్రులు తల్లిపోతున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ‘పెద్ది’ కుటుంబానికి రూ.2.25 కోట్లు

మొదటి పేజీ తరువాయి

చెరో కోటి రూపాయల చొప్పున ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించారు. అదే సమయంలో పెద్ది సుదర్శన్ రెడ్డి తల్లి అమృతమ్మ వృద్ధాప్యంలో ఉన్నందున వారి బాగోగుల కోసం మరో రూ. 25 లక్షలను తల్లి పేరు మీద బ్యాంకులో జమ చేయాలని కేసీఆర్ నిర్ణయించారు. మొత్తంగా రూ. 2 కోట్ల 25 లక్షల రూపాయలను పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందించి అండగా నిలవాలని బీఆర్ఎస్ నిర్ణయం తీసుకుంది. పిల్లల భవిష్యత్తు, వారి చదువు తదితర కుటుంబ సంక్షేమానికి సంబంధించి పార్టీ నిరంతరం పర్యవేక్షిస్తూ అండగా నిలుస్తుందని కేసీఆర్ పేర్కొన్నారు.

# అధికారులకు బాధలు!

మొదటి పేజీ తరువాయి

క్రియాశీలక బాధ్యతలకు దూరంగా ఉన్నారన్నది అధికార వర్గాల్లో ఆసక్తికర చర్చగా మారింది. కాట ఆమ్రపాలి తెలంగాణలో పనిచేసిన సమయంలో తనదైన శైలితో గుర్తింపు పొందారు. యువ, చురుకైన అధికారిగా పేరుతెచ్చుకున్న ఆమెకు వివిధ కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన అనంతరం కేంద్ర సిబ్బంది, శిక్షణ శాఖ కేటాయింపుల ప్రకారం ఆమెకు ఆంధ్రప్రదేశ్ కేడర్ దక్కింది. అయితే తెలంగాణలోనే కొనసాగాలన్న ఆమె అభీష్టం, కేడర్ కేటాయింపుపై ఏర్పడిన వివాదం చివరకు న్యాయపోరాటానికి దారితీసింది. సుదీర్ఘ పరిణామాల అనంతరం ఆమె ఏపీ కేడర్‌కు వెళ్లాల్సి వచ్చింది. ఏపీలో బాధ్యతలు చేపట్టిన తర్వాత కొంతకాలం సెలవుల్లో ఉండటం, అనంతరం పోస్టింగ్ విషయంలో చోటుచేసుకున్న పరిణామాలు ఆమె కెరీర్‌పై ప్రభావం చూపాయి. చివరకు ప్రస్తుతం ఆమెకు క్రియాశీలక పరిపాలనా బాధ్యతలు లేకపోవడం చర్చకు దారితీసింది.

### స్మితా సబర్వాల్.. తెలంగాణలో మారిన సమీకరణాలు

తెలంగాణలో స్మితా సబర్వాల్ పేరు ఒకప్పుడు అత్యంత కీలకమైన అధికారుల్లో ఒకటిగా వినిపించేది. ముఖ్యమంత్రి కార్యాలయంలో కీలక బాధ్యతలతో పాటు వివిధ శాఖల్లో పనిచేసిన ఆమె పాలనా సంస్కరణలు, ప్రజలకు చేరువయ్యే కార్యక్రమాల అమలులో ప్రత్యేక గుర్తింపు పొందారు. అయితే రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత పాలనా సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. కొత్త ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా అధికారుల బాధ్యతలు కూడా పునర్వ్యవస్థీకరించబడ్డాయి. ఈ క్రమంలో స్మితా సబర్వాల్ కూడా కీలక బాధ్యతలకు దూరమయ్యారు. కొత్త పాలన వ్యవస్థతో ఆమెకు సరితూగే పరిస్థితులు ఏర్పడలేదన్న చర్చ అధికార వర్గాల్లో ఉన్నప్పటికీ, దానికి సంబంధించి వివిధ అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆమె గతంలో చేసిన కొన్ని బహిరంగ వ్యాఖ్యలు, సామాజిక మాధ్యమాల్లో వ్యక్తం చేసిన అభిప్రాయాలు కూడా అప్పుడప్పుడు చర్చకు వచ్చాయి. అనంతరం ఆమె క్రియాశీల పరిపాలనా బాధ్యతలకు దూరంగా ఉండటం, సెలవుల్లో కొనసాగడం వంటి పరిణామాలు ఆసక్తిని రేకెత్తించాయి.

### బ్యూరోక్రసీలో ‘లౌక్యం’ ముఖ్యం?

అధికార వ్యవస్థలో ప్రతిభ, సమర్థతతో పాటు పాలక ప్రభుత్వ ప్రాధాన్యతలను అర్థం చేసుకుని పనిచేయడం కూడా కీలకమే. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికైన ప్రభుత్వం తీసుకునే విధాన నిర్ణయాలను అమలు చేయడం అధికార యంత్రాంగం బాధ్యత. అదే సమయంలో అధికారులు తమ వృత్తిపరమైన స్వతంత్రతను, నిబంధనలను, పరిపాలనా విలువలను కాపాడుకోవాల్సిన అవసరం కూడా ఉంటుంది. ఈ రెండింటి మధ్య సమతుల్యత సాధించడం సీనియర్ అధికారులకు ఎప్పుడూ సవాలే. ఆ సమతుల్యత సాధించడంలో ఎవరు ఎంతవరకు విజయవంతమయ్యారన్నది వ్యక్తిగత అభిప్రాయాల అంశమే. కానీ ప్రభుత్వాలు మారిన ప్రతిసారీ సమర్థతకు పేరుగాంచిన అధికారులు క్రియాశీల బాధ్యతలకు దూరమవుతుంటే.. అది కేవలం వ్యక్తుల కెరీర్ సమస్యగానే కాకుండా పాలనా వ్యవస్థపై కూడా చర్చకు దారితీస్తుంది. ఆమ్రపాలి, స్మితా సబర్వాల్ వంటి అధికారులు తమ తమ సందర్భాల్లో ప్రజల దృష్టిని ఆకర్షించినవారే. వారి పని తీరు, నిర్ణయాలు, పరిపాలనా శైలి అన్నింటిపై భిన్నాభిప్రాయాలు ఉండొచ్చు. కానీ అనుభవం, సామర్థ్యం ఉన్న అధికారులు పాలనా వ్యవస్థలో చురుకుగా పనిచేయడం ప్రభుత్వాలకు, ప్రజలకు మేలు చేస్తుంది. ప్రభుత్వాలు మారవచ్చు.. విధానాలు మారవచ్చు.. పాలనా ప్రాధాన్యతలు మారవచ్చు. కానీ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్న లక్ష్యం మాత్రం మారకూడదు. అందుకే అధికారుల నియామకాల్లో రాజకీయ అనుకూలతల కంటే సామర్థ్యం, అనుభవం, నిజాయతీ, ఫలితాలు సాధించే శక్తికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఒకప్పుడు పాలనలో గొప్పగా వెలిగిన అధికారులే ఇప్పుడు క్రియాశీల బాధ్యతలకు దూరంగా ఉండటం.. వ్యక్తులకే కాదు, మొత్తం అధికార వ్యవస్థలో ప్రతిభకు ఇచ్చే ప్రాధాన్యతపైనా ప్రశ్నలు లేవనెత్తుతోంది.





# రైతులకు డ్రోన్ సాంకేతికతపై అవగాహన

## వ్యవసాయ సమస్యల గుర్తింపునకు వినూత్న పద్ధతులు.. పొలాల్లో సందడి చేసిన వ్యవసాయ కళాశాల విద్యార్థులు

రాజన్న సిరిసిల్ల బ్యూరో, ఆగస్టు 8 (ఈవార్తలు): రైతుల వ్యవసాయ సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించడంతో పాటు ఆధునిక సాంకేతికతను వ్యవసాయంలో వినియోగించడంపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించారు. బోయినపల్లి మండలం తడగొండ గ్రామంలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు గ్రామీణ వ్యవసాయ అనుభవ కార్యక్రమంలో భాగంగా రైతులతో కలిసి పలు కార్యక్రమాలు చేపట్టారు. వేములవాడ నియోజకవర్గ పరిధిలోని చందుర్తి గ్రామపంచాయతీలో భాగస్వామ్య గ్రామీణ అంచనా కార్యక్రమాన్ని నిర్వహించారు. బి.జె.ఆర్. వ్యవసాయ కళాశాల తుది సంవత్సరం విద్యార్థినులు అంగోతు దీప్తికల, దీటి సృజన, నిమ్రా, ఆకుల లయ, షిప్న స్థానిక రైతులతో కలిసి వ్యవసాయ సమస్యలను గుర్తించే ప్రక్రియలో పాల్గొన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించడం, గ్రామంలోని అందుబాటులో ఉన్న వనరులను అంచనా వేయడం కోసం సామాజిక పట రూపకల్పన, వనరుల పట రూపకల్పన, సమస్యల ప్రాధాన్యత పట్టిక వంటి పద్ధతులను విద్యార్థులు రైతులకు క్షేత్రస్థాయిలో వివరించారు. వ్యవసాయంలో డ్రోన్ సాంకేతికత వినియోగంపై కూడా రైతులకు అవగాహన కల్పించారు. పంటల పరిస్థితిని పరిశీలించడం, సమస్యలను వేగంగా గుర్తించడం, వ్యవసాయ పనుల్లో సమయం, పెట్టుబడి, శ్రమను ఆదా చేసుకోవడంలో డ్రోన్ సాంకేతికత ఎలా ఉపయోగపడుతుందో వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఆర్. సాయి కుమార్, చందుర్తి గ్రామ సర్పంచ్ పులి సత్యం, ఉపసర్పంచ్ క్రాంతి, గ్రామ నాయకులు, రైతులు పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోకి వచ్చి రైతులతో మమేకమై ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పిస్తున్న విద్యార్థుల చొరవను గ్రామ పెద్దలు, రైతులు, అధికారులు అభినందించారు. ఆధునిక సాంకేతికతను సమర్థంగా వినియోగించుకోవడం ద్వారా వ్యవసాయాన్ని మరింత లాభదాయకంగా, సమర్థవంతంగా నిర్వహించుకోవచ్చని ఈ సందర్భంగా సూచించారు.

## వివేకా హత్య వెనుక పెద్ద కుట్ర

### రాష్ట్రపతికి లేఖ రాసిన సునీత

హైదరాబాద్, ఆగస్టు 8 (ఈవార్తలు): మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసుకు సంబంధించి ఆయన కుమార్తె డాక్టర్ వైఎస్ సునీతా రెడ్డి, భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు లేఖ రాశారు. తన తండ్రి హత్యకు గురై ఏడేళ్లకు పైగా గడిచినా తమ కుటుంబానికి ఇంతవరకు పూర్తి న్యాయం జరగలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. వివేకా హత్య వెనుక కచ్చితంగా పెద్ద కుట్ర ఉందని ఉద్ఘాటించారు. కేసు దర్యాప్తులో వెలుగు చూడని అనేక కీలక అంశాలను వెలికితీయాలని, నిందితులకు కఠిన శిక్ష పడేలా చూడాలని ఆమె తన లేఖలో కోరారు. ఈ కేసుకు సంబంధించి ఇప్పటివరకు జరిగిన సీబీఐ దర్యాప్తు, తదనంతర పరిణామాలను సునీత తన లేఖలో రాష్ట్రపతికి వివరించారు. హత్య జరిగి ఇన్నేళ్లయినా నేటికీ హత్యకు ఉపయోగించిన ఆయుధాన్ని స్వాధీనం చేసుకోలేకపోవడంపై ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. హత్య వెనుక ఉన్న పెద్ద కుట్రను, కోట్లాది రూపాయల ఆర్థిక లావాదేవీల కోణాన్ని సమగ్రంగా విచారించాలని డిమాండ్ చేశారు. దర్యాప్తులో కొన్ని కీలకమైన అంశాలు అపరిష్కృతంగానే మిగిలిపోయాయని ఆమె పేర్కొన్నారు. ముఖ్యంగా, వివేకా హత్య వార్త బయటకు రాకముందే అప్పటి ప్రతిపక్ష నేత జగన్ కు ఎలా తెలిసిందనే అంశాన్ని లోతుగా దర్యాప్తు చేయాలని సునీత కోరారు. ఈ విషయంలో జగన్ పాత్రపై విచారణ జరపాల్సి ఉందని 2023 మే 25న సీబీఐ స్వయంగా హైకోర్టులో దాఖలు చేసిన అదనపు అఫిడవిట్‌ను ఆమె తన లేఖలో ఉటంకించారు. ఈ కీలక అంశాన్ని ట్రయల్ కోర్టు పరిగణనలోకి తీసుకోలేదని ఆమె తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మూడు ప్రత్యేక దర్యాప్తు బృందాలను (సిట్) ఏర్పాటు చేసినా, ఆ తర్వాత సీబీఐ నాలుగు చార్జిషీట్లు దాఖలు చేసినా, కేసులో లోతైన దర్యాప్తు జరగలేదనే భావనను ఆమె వ్యక్తం చేశారు.

## మెగా డీఎస్సీ కాదు.. దగా డీఎస్సీ

### మాజీ మంత్రి రోజా ఫైర్

నగరి, ఆగస్టు 8 (ఈవార్తలు): ఏపీ డీఎస్సీ ఉపాధ్యాయ నియామకాల ప్రక్రియలో తీవ్ర అక్రమాలు జరిగాయని, దీనిపై తక్షణమే సీబీఐ విచారణకు ఆదేశించాలని మాజీ మంత్రి, వైసీపీ నేత రోజా డిమాండ్ చేశారు. వైసీపీ పిలుపు మేరకు నగరిలో చేపట్టిన మూడో రోజు రిలే నిరాహార దీక్షలో ఆమె మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఈ అక్రమాలపై ఎందుకు నోరు విప్పడం లేదని ప్రశ్నించారు. మెరిట్ ఉన్న అర్హులైన అభ్యర్థులకు ఉద్యోగాలు ఇవ్వకుండా, లంచాలు దండుకుని అనర్హులకు కట్టబెట్టారని తీవ్రంగా ఆరోపించారు. ఈ ఘటనలపై మంత్రి నారా లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ స్పందించి రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే శాంతియుతంగా నిరసన తెలుపుతున్న తమ దీక్షా శిబిరాలపై కోడిగుడ్లతో దాడులు చేస్తూ భయాందోళనలకు గురిచేస్తున్నారని రోజా మండిపడ్డారు. ఈ దీక్షకు సంఘీభావం తెలిపిన తిరుపతి, చిత్తూరు జిల్లాల వైసీపీ అధ్యక్షుడు భూమన కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ... డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించే వరకు నిరసనలు ఆపేది లేదని, తిరుపతిలో త్వరలోనే భారీ నిరసన ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు.

## బీజేపీతో పొత్తు నిర్ణయం పవన్‌దే

### జనసేన తెలంగాణ చీఫ్ శంకర్ గౌడ్ వెల్లడి

హైదరాబాద్, ఆగస్టు 8 (ఈవార్తలు): తెలంగాణలో పొత్తులపై జనసేన రాష్ట్ర శాఖ అధ్యక్షుడు శంకర్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. బీజేపీతో పొత్తుల అంశాన్ని పార్టీ అధినేత పవన్ కల్యాణ్, బీజేపీ జాతీయ నాయకులు నిర్ణయిస్తారని తెలిపారు. ఈ నిర్ణయం తీసుకునే విషయం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు పరిధిలోని అంశం పరిధిలోనిది కాదని ఆయన స్పష్టం చేశారు. బీజేపీతో పొత్తు కుదరకపోతే తెలంగాణలో జనసేన సొంతంగా ఎన్నికల బరిలోకి దిగుతుందని శంకర్ గౌడ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో జనసేనకు ఆదరణ క్రమంగా పెరుగుతోందని చెప్పారు. పవన్ కల్యాణ్ మంచి పనులు చేస్తున్నారనే నమ్మకం ప్రజల్లో ఏర్పడిందని.. దీంతో ముఖ్యంగా యువత పెద్ద సంఖ్యలో పార్టీలో చేరుతున్నారని తెలిపారు. మరోవైపు బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు కూడా పొత్తులపై శుక్రవారం కీలక వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఢిల్లీలో పార్టీ పెద్దలను కలిసిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఏ పార్టీతోనూ పొత్తు ఉండదని ప్రకటించారు. తెలంగాణలో బీజేపీ ఒంటరిగానే పోటీ చేస్తుందని స్పష్టం చేశారు. జాతీయ స్థాయిలో బీజేపీ, జనసేన మిత్రపక్షాలుగా కొనసాగుతున్నాయి. రాష్ట్రంలో మాత్రం రానున్న ఎన్నికల్లో ఇరు పార్టీల మధ్య పొత్తు ఉంటుందా? లేదా? అన్నదానిపై ప్రస్తుతం స్పష్టత లేదు.

## షబ్బీర్ అలీ గెస్ట్ హౌస్ ప్రహరీ కూల్చివేత

మెదక్, ఆగస్టు 8 (ఈవార్తలు): పంట పొలాలకు వెళ్లే దారిని మాయం చేశారంటూ ఆగ్రహించిన గ్రామస్తులు... రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ గెస్ట్ హౌస్ కాంపౌండ్ వాల్‌ను నేలమట్టం చేశారు. మెదక్ జిల్లా నార్సింగి మండలం జప్తిశివునూర్‌లో ఈ ఉదయం ఒక్కసారిగా విరుచుకుపడ్డ రైతులు, శతాబ్దాల నాటి ప్రధాన బాటను మూసివేసి కాంపౌండ్ కట్టడంపై తీవ్ర నిరసన వ్యక్తంచేశారు. గతంలో ఈ సమస్యపై షబ్బీర్ అలీకి మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయిందని... పొలాలకు రాకపోకలు బంద్ కావడంతోనే తాము ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని స్థానికులు మండిపడ్డారు. విషయం తెలుసుకుని రంగంలోకి దిగిన పోలీసులు గ్రామస్తులను అడ్డుకునే ప్రయత్నం చేయడంతో ఇరువర్గాల మధ్య గొడవ జరిగింది.

# జన 'సేనుడి'కి జాగా ఏది?

## జెండా మోసినా గుర్తింపేది?.. పిఠాపురంలో క్షేత్రస్థాయిలో అసంతృప్తి

**కొత్తగా వచ్చిన వారికే పెద్దపీట?**

**గ్రూపు రాజకీయాలతో కార్యకర్తల్లో కలవరం**

**ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని డిమాండ్**

కాకినాడ బ్యూరో, ఆగస్టు 8 (ఈవార్తలు): ఏపీలోని పిఠాపురం నియోజకవర్గంలో జనసేనలో అంతర్గత విభేదాలు, గ్రూపు రాజకీయాలపై చర్చ జోరందుకుంది. పార్టీ కష్టకాలంలో జెండా మోసిన క్షేత్రస్థాయి కార్యకర్తలకు ప్రస్తుతం తగిన గుర్తింపు, ప్రాధాన్యం దక్కడం లేదనే అసంతృప్తి పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతోంది. తమను పక్కనపెట్టి కొత్తగా వచ్చిన వారికి పదవులు, ప్రాధాన్యం కల్పిస్తున్నారనే అభిప్రాయాలు కొందరు కార్యకర్తల నుంచి వినిపిస్తున్నాయి. జనసేన ఆవిర్భావం నుంచి పార్టీ కోసం పనిచేసిన పలువురు కార్యకర్తలు 2019 ఎన్నికల సమయంలో గ్రామాలు, వార్డుల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పోలింగ్ ఏజెంట్లను ఏర్పాటు చేయడం మొదలుకొని పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే వరకు క్షేత్రస్థాయి సైనికులు కీలకంగా పనిచేశారని గుర్తుచేస్తున్నారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత అదే కార్యకర్తలకు తగిన గుర్తింపు లభించడం లేదనే ఆవేదన వ్యక్తమవుతోంది. మర్రి దొరబాబు వంటి క్షేత్రస్థాయిలో పార్టీ కోసం పనిచేసిన వారిని పక్కన పెడుతున్నారనే చర్చ కూడా స్థానికంగా జరుగుతోంది. కష్టకాలం లో పార్టీ జెండా మోసిన వారికి కాకుండా ఇటీవల పార్టీలోకి వచ్చిన వారికి ప్రాధాన్యం పెరుగుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.



ఈ పరిణామాలతో కొందరు సీనియర్ కార్యకర్తలు సైతం పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారనే ప్రచారం జరుగుతోంది. అయితే ఈ అంశాలపై పార్టీ నాయకత్వం అధికారికంగా స్పందించాల్సి ఉంది.

### ప్రజా సమస్యల సంగతేంటి?

గొల్లప్రోలు పట్టణంలో తాగునీరు, రహదారులు, పారిశుధ్యం, ఉపాధి వంటి సమస్యలు ప్రజలను వేధిస్తున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. వీటిపై ప్రజల తరఫున గట్టిగా పోరాడాల్సిన సమయంలో నాయకుల మధ్య నెలకొన్న అంతర్గత వ్యవహారాలే చర్చనీయాంశంగా మారడం ఆందోళన కలిగిస్తోందని రాజకీయ వర్గాలు అంటున్నాయి. నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం లోపిస్తే దాని ప్రభావం పార్టీపై పడే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలాన్ని కాపాడుకోవాలంటే అందరినీ కలుపుకొని ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు.

### అధిష్ఠానం దృష్టి పెట్టేనా?

పార్టీ కోసం కష్టపడిన సీనియర్, క్షేత్రస్థాయి కార్యకర్తలను గుర్తించి వారికి తగిన ప్రాధాన్యం కల్పించాలని పలువురు కోరుతున్నారు. వ్యక్తిగత విభేదాలు, గ్రూపు రాజకీయాలకు స్వస్తి పలికి ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని సూచిస్తున్నారు. పిఠాపురం నియోజకవర్గంలో క్షేత్రస్థాయి పరిస్థితులపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా దృష్టి సారించి, కార్యకర్తల మధ్య నెలకొన్న అసంతృప్తిని చల్లార్చేందుకు చర్యలు తీసుకోవాలని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. పార్టీ బలోపేతానికి ఐక్యతే కీలకమని, అందరినీ కలుపుకొని నడిస్తేనే క్షేత్రస్థాయిలో జనసేన మరింత బలోపేతమవుతుందని కార్యకర్తలు చెబుతున్నారు.


## తెలంగాణ నీళ్లు దోచుకుంటే ఉద్యమమే

### నదీజలాల్లో హక్కులకు భంగం కలిగితే ఊరుకోం

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



హైదరాబాద్, ఆగస్టు 8 (ఈవార్తలు): నదీ జలాల్లో కేంద్రమైనా, రాష్ట్రమైనా నష్టం కలిగించేలా వ్యవహరిస్తే తిరుగుబాటు తప్పదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వాన్ని అడ్డు పెట్టుకొని తెలంగాణకు నీటి వాటాల్లో అన్యాయం చేస్తే, తెలంగాణ ఉద్యమానికి మించి మరొక ఆందోళన వస్తుందని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని నందినగర్‌లో మీడియాతో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. వచ్చేవారం జరిగే జీఆర్ఎంబీ సమావేశం ఎజెండా ఎందుకు అంగీకరించారో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశం ఎజెండా పూర్తిగా తెలంగాణ హక్కులను కాల రాస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ హక్కులను ఏ విధంగా కాపాడతారో రేవంత్, ఉత్తమ్ కుమార్ రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. తెలంగాణ వ్యతిరేకి ఆదిత్యనాథ్ దాస్‌ను సలహాదారుగా పెట్టుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన సిగ్గుమాలిన చర్య అని విమర్శించారు. తెలంగాణలో ఒక్క ఇంజనీర్ కూడా లేరా? ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చెప్పుచేతల్లోకి తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తుంది. చంద్రబాబు చెప్పు చేతల్లో రేవంత్ రెడ్డి నడుస్తున్నాడు. రేవంత్ రెడ్డికి సిగ్గుంటే ఆదిత్యనాథ్ దాస్ ని తొలగించాలని డిమాండ్ చేశారు. నీళ్లు, నిధులు, నియామకాలతో కొట్లాడిన తెలంగాణలో మరోసారి నీళ్ల దోపిడీకి తెలంగాణ గురవుతున్నదని, ఇదే జరిగితే కచ్చితంగా బీఆర్ఎస్ మరోసారి నీళ్ల కోసం ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి సిగ్గు ఉంటే ఈ సమావేశాన్ని బహిష్కరించాలని సూచించారు. నార్లాపూర్‌ను ముట్టడించి పంపులను ఆన్ చేస్తామని బీఆర్ఎస్ హెచ్చరికలకు ప్రభుత్వం దిగివచ్చి పంపులని ఆన్ చేసిందని వెల్లడించారు. పాలమూరు బిడ్డ అని చెప్పుకునే రేవంత్ రెడ్డికి పాలమూరు నీళ్లు ఇచ్చే సోయి లేదు. వర్షాలు పడి పక్క రాష్ట్రం నీళ్లు ఎత్తి పోసుకుంటే ముఖ్యమంత్రికి పట్టింపు లేదు. ప్రధాన ప్రతిపక్షం ముళ్లు కట్టెతో పొడిస్తేనే ఈ ప్రభుత్వం స్పందిస్తుంది లేదంటే నిద్రపోతున్నదని పేర్కొన్నారు.




## హైడ్రాలో 150 ఉద్యోగాలకు వేలల్లో అభ్యర్థులు

### సరూర్‌నగర్ స్టేడియానికి తరలివచ్చిన నిరుద్యోగులు

రంగారెడ్డి, ఆగస్టు 8 (ఈవార్తలు): హైదరాబాద్‌లో కొద్దిపాటి ప్రభుత్వ ఉద్యోగాల కోసం నిరుద్యోగులు ఏ స్థాయిలో ఎదురుచూస్తున్నారో చెప్పేందుకు సరూర్‌నగర్ స్టేడియంలో జరిగిన ఘటనే నిదర్శనం. 'హైడ్రా' ప్రకటించిన 150 పోస్టుల కోసం వేలాది మంది యువత తరలిరావడంతో తీవ్ర తోపులాట చోటుచేసుకుంది. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వివరాల్లోకి వెళితే.. హైడ్రా విభాగంలో 100 డీఆర్ఎఫ్ అసిస్టెంట్లు, 50 హెవీ వెహికల్ డ్రైవర్ల పోస్టుల భర్తీకి అధికారులు ప్రకటన విడుదల చేశారు. దీని కోసం ఆగస్టు 8, 9 తేదీల్లో సరూర్‌నగర్ స్టేడియంలో ఉదయం 5 గంటల నుంచి ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 800 మీటర్ల పరుగు, 100 మీటర్ల స్ప్రింట్, లాంగ్ జంప్, షాట్‌పుట్ వంటి ఈవెంట్లలో అర్హత సాధించాలని సూచించారు. అయితే, ప్రకటించిన పోస్టుల కంటే కొన్ని వందల రెట్లు ఎక్కువగా నిరుద్యోగులు ఇవాళ తెల్లవారుజామునకే స్టేడియం వద్దకు చేరుకున్నారు. లోపలికి వెళ్లే క్రమంలో ఒకరినొకరు తోసుకోవడంతో పరిస్థితి అదుపుతప్పింది. ఈ క్రమంలో జరిగిన తోపులాటతో కొద్దిసేపు గందరగోళం నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే రంగ ప్రవేశం చేసి, గుంపును చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఈ తోపులాటకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

**మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!**

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.

## 'ఇందిరమ్మ' టవర్స్‌కు భారీ స్పందన

**7,340 ఇండ్లకు దరఖాస్తు లు 35,125**

**మరో రెండు రోజులు మాత్రమే గడువు**

**ఆగస్టు 20 తరువాత లాటరీ**

**ఏడాదిలోగా లబ్ధిదారులకు అందజేత**

**హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ వీపీ గౌతం**

హైదరాబాద్, ఆగస్టు 8 (ఈవార్తలు): హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్లకు భారీగా దరఖాస్తులు వస్తున్నాయి. హైదరాబాద్ క్యూర్ పరిధిలోని పేద ప్రజలకు సొంతి ఇంటిని కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్లు టవర్స్ నిర్మించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. మొత్తం ఒక లక్ష ఇండ్లను నిర్మించాలని ప్రభుత్వం సంకల్పించగా... పైలట్ ప్రాజెక్టుగా ప్రతి నియోజకవర్గంలోనూ 500 ఇండ్ల చొప్పున నిర్మాణాలను చేపడుతున్నారు. ఇందులో భాగంగా 16 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో నిర్మించనున్న 7,340 ఇళ్ల కోసం దరఖాస్తుల స్వీకరణ చేపట్టింది. అయితే ఇందుకోసం భారీ సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నాయి. ఈ ఇళ్ల కోసం శనివారం నాటికి 35,125 దరఖాస్తులు వచ్చాయని తెలంగాణ హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ వీపీ గౌతమ్ తెలిపారు. అర్హులైన వ్యక్తులు దరఖాస్తులు చేసుకునేందుకు మరో రెండు రోజుల సమయం ఉందని చెప్పారు. ఈ నెల పదో తేదీ వరకు ఇళ్ల కోసం దరఖాస్తులు సమర్పించవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి సందేహాలు ఉంటే కాల్ సెంటర్ ఫోన్ నెంబరు 040-24603572 ను సంప్రదించవచ్చని గౌతమ్ సూచించారు. 'సొంత ఇంటి వసతిని కల్పించుకోవడమనేది కష్టతరమైనదిగా భావించే అల్పాదాయ వర్గాల ప్రజలకు అందుబాటులో, అతి తక్కువ ధరలతోనే ఇంటిని సమకూర్చేలక్ష్యంతో ఈ పథకానికి రూపకల్పన చేయడం జరిగింది. అంతే కాకుండా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత తొలిసారిగా ఇటువంటి పథకాన్ని అమలు చేస్తున్నారు. ప్రతి నియోజకవర్గంలోనూ ఎంతో విలువైన భూముల్లో నిర్మిస్తున్న ఈ ఇండ్లను కేవలం నామమాత్రపు ధరకే అందిస్తున్నారు. బహిరంగ మార్కెట్ లో 30 నుంచి 58 లక్షల రూపాయల వలకు ధర పలికే ఈ ఫ్లాట్లను ప్రజల సంక్షేమం కోసం వారి జీవన ప్రమాణాలను మెరుగు పరచాలన్న ఉద్దేశ్యంతో కేవలం 6 లక్షల రూపాయలకే ప్రభుత్వం కేటాయిస్తుంది' అని తెలిపారు. అంతే కాకుండా ఇళ్లు పొందిన వారికి రిజిస్ట్రేషన్ చేస్తామని వివరించారు. ప్రజలు సొంత ఇంటి కోసం తాము నివసిస్తున్న ప్రాంతాల నుంచి వలస/తరలి వెళ్లకుండా, ప్రస్తుతం వారు ఉంటున్న నియోజకవర్గంలోనే సొంత ఇంటిని పొందే అవకాశం ఈ పథకం ద్వారా లభిస్తుందని తెలిపారు. ఈ పథకం కింద దరఖాస్తు చేసుకునే సమయంలో ఎటువంటి కుల, ఆదాయ సర్టిఫికెట్లు సమర్పించాల్సిన అవసరం లేదని ఆయన పేర్కొన్నారు. ఇళ్లు కేటాయించని పక్షంలో దరఖాస్తుదారులు చెల్లించిన ధరావతు ఫీజు రూ.10,000ను తిరిగి చెల్లిస్తామని స్పష్టం చేశారు. ఇక, దరఖాస్తులకు ఇళ్ల కేటాయింపునకు సంబంధించిన లాటరీ ప్రక్రియను ఈ నెల 20 వ తేదీ నుంచి చేపట్టాలని ప్రాథమికంగా నిర్ణయించినట్టుగా గౌతమ్ తెలిపారు. అంతే కాకుండా ఆయా ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల టవర్స్ నిర్మాణ పనులను చేపట్టడానికి టెండర్ ప్రక్రియను కూడా చేపట్టినట్టుగా పేర్కొన్నారు. ఈ ఇళ్లు మొత్తం ఒక ఏడాది లోపే పూర్తి చేసి లబ్ధిదారులకు అందించేలా పకడ్బందీ ప్రణాళికను అమలు చేస్తున్నట్లు వెల్లడించారు.



## సుశాంత్‌ది సాధారణ ప్రమాదం కాదు

**అధికారుల నిర్లక్ష్యమే కారణం.. భీమన్నగుట్ట తవ్వకాలపై చర్యలు తీసుకోవాలి**

**మాజీమంత్రి జీవన్ రెడ్డి డిమాండ్.. బాధిత కుటుంబానికి పరామర్శ**

జగిత్యాల రూరల్, ఆగస్టు 8 (ఈవార్తలు): మాల్యాల ఎస్టీ గురుకుల పాఠశాల విద్యార్థి సుశాంత్ కుంటలో పడి మృతి చెందడం సాధారణ ప్రమాదం కాదని, అధికారుల నిర్లక్ష్యమే కారణమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్‌రెడ్డి ఆరోపించారు. టీఆర్ నగర్‌లోని సుశాంత్ కుటుంబాన్ని ఆయన శనివారం పరామర్శించి, కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. పాఠశాల సమీపంలోని భీమన్నగుట్టను అక్రమంగా తవ్వి మట్టిని తరలించడం వల్ల ఏర్పడిన కుంటలో బాలుడు మృతి చెందాడని అన్నారు. అక్రమ తవ్వకాలకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని, జిల్లాలో గుట్టల తవ్వకాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. పదేళ్ల క్రితం, ప్రస్తుతం గుట్టల పరిస్థితిని గూగుల్ మ్యాప్‌ల ద్వారా పరిశీలించాలని కలెక్టర్‌ను కోరారు. సుశాంత్ కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షల పరిహారం, టీఆర్ నగర్‌లో ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.6 లక్షలు అందించాలని డిమాండ్ చేశారు. ఘటనను మానవ హక్కుల కమిషన్, ఎస్టీ కమిషన్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. పర్యావరణానికి విఘాతం కలిగించే తవ్వకాలపై సంబంధిత శాఖకు ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ దేవేందర్ నాయక్, సర్పంచులు శీలం సురేందర్, వంశీ, నాయకులు సిరాజ్, రజనీకాంత్, సురేశ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.





# భూసేకరణకు రూ.5 వేల కోట్లు

## ఇప్పటికే రూ.2 వేల కోట్లు విడుదల.. మరో రూ.3 వేల కోట్లకు సన్నాహాలు

**మిడ్‌మానేరు పనులు వెంటనే ప్రారంభించాలి.. పత్తిపాక డీపీఆర్ నెలాఖరులోగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి**

జగిత్యాల, ఆగస్టు 8 (ఈవార్తలు): సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ, పునరావాసం--పునర్నిర్మాణం కోసం రూ.5 వేల కోట్లు సమకూర్చనున్నట్లు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే రూ.2 వేల కోట్లు విడుదల చేశామని, మరో రూ.3 వేల కోట్ల విడుదల ప్రక్రియ కొనసాగుతోందని చెప్పారు. నిధుల కొరతతో పూర్తికి చేరువలో ఉన్న ఏ ప్రాజెక్టు కూడా నిలిచిపోకూడదని అధికారులను ఆదేశించారు. కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల సాగునీటి ప్రాజెక్టులపై శనివారం హైదరాబాద్‌లో సమీక్ష నిర్వహించారు. భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్, అటవీ, పర్యావరణ అనుమతులను ప్రాధాన్య అంశాలుగా తీసుకుని వెంటనే పరిష్కరించాలని కలెక్టర్లకు సూచించారు. అవసరమైన నిధుల కోసం ఆలస్యం చేయకుండా ప్రతిపాదనలు పంపాలని చెప్పారు. సుమారు నాలుగున్నరేళ్లుగా నిలిచిపోయిన మిడ్‌మానేరు ఎడమ కాలువ మిగులు పనులను వెంటనే పునఃప్రారంభించాలని ఉత్తమ్ ఆదేశించారు. భూసంబంధిత సమస్యలను పరిష్కరించడంతోపాటు సవరించిన అంచనాలు, భూసేకరణ, టెండర్లు, అనుమతుల ప్రక్రియలను సమాంతరంగా చేపట్టాలని సూచించారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలో ప్రతిపాదించిన పత్తిపాక రిజర్వాయర్ ద్వారా కొత్తగా 10 వేల ఎకరాలకు సాగునీరు అందించడంతోపాటు 2.40 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. 3 లేదా 5 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మించే ప్రత్యామ్నాయాలను పరిశీలిస్తున్నారు.

ఆగస్టు నెలాఖరులోగా డీపీఆర్ సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలంలోని రోళ్లవాగు ప్రాజెక్టు పనులు 96 శాతం పూర్తయ్యాయి. ప్రాజెక్టు నిల్వ సామర్థ్యాన్ని పెంచి దాదాపు 15 వేల ఎకరాలకు సాగునీరు అందించాలన్నది లక్ష్యం. బండ్-2లో కొంత భాగం అటవీ భూమిలో ఉండటంతో మిగిలిన పనులకు అటవీ అనుమతులు అవసరమవుతున్నాయి. వాటిని త్వరగా పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టుల వారీగా పెండింగ్ సమస్యలపై 'యాక్షన్ పాయింట్లు' రూపొందించి, నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కరించాలని ఉత్తమ్ స్పష్టం చేశారు.



## కోరుట్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

**మంత్రుల దృష్టికి నియోజకవర్గ సమస్యలు**

**ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ వినతి**

హైదరాబాద్, ఆగస్టు 8 (ఈవార్తలు): హైదరాబాద్ సచివాలయంలో శనివారం జరిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా సమీక్ష సమావేశంలో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పాల్గొని నియోజకవర్గ సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. మెట్‌పల్లి, కోరుట్ల ఇంటిగ్రేటెడ్ మార్కెట్ల నిర్మాణానికి, ఇబ్రహీంపట్నం మండలం ఫకీర్ కొండాపూర్ బ్రిడ్జి, కోరుట్ల మండలం కల్లూర్ బ్రిడ్జి నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఇబ్రహీంపట్నం మెయిన్ రోడ్డు--మొగిలిపేట రోడ్డు అభివృద్ధికి నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. మెట్‌పల్లి ఉర్దూ మీడియం పాఠశాల, పాఠశాల, జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల భవనాల నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరారు. నియోజకవర్గంలోని రోడ్లు, మున్సిపాలిటీల అభివృద్ధితోపాటు మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి, కోరుట్ల నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే సంజయ్ మంత్రులను కోరారు.



## ధర్మారం ఆదర్శ పాఠశాలలో ఘనంగా బోనాలు

**తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను చాటిన విద్యార్థులు**

ధర్మారం, ఆగస్టు 8 (ఈవార్తలు): పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో ప్రిన్సిపల్ రాజ్‌కుమార్ ఈరవేణి ఆధ్వర్యంలో ఆషాఢ మాసం సందర్భంగా శనివారం బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల విశిష్టతను విద్యార్థులకు తెలియజేసేలా కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఇంటి నుంచి తీసుకొచ్చిన పసుపు, కుంకుమ, వేపాకులు, బెల్లం, పాలతో తయారు చేసిన బోనాలను అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించారు. విద్యార్థుల పోతురాజుల వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వెల్గొండలో రూ.10 లక్షల సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



బుగ్గారం, ఆగస్టు 8 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం వెల్గొండ గ్రామంలో రూ.10 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సహకారంతో మంజూరైన ప్రత్యేక నిధులతో ఈ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. స్థానిక సర్పంచ్ నీలం నందిని సంతోష్‌తో కలిసి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నగునూరి నర్సగౌడ్ కొబ్బరికాయ కొట్టి, భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. రోడ్డు పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచించారు. రోడ్డు అధ్వానంగా ఉండటంతో వర్షాకాలంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్థులు తెలిపారు. సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించినందుకు నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

## భీమన్న సేవలో 'రాజు వెడ్స్ రాంబాయి' హీరో

**కోడె మొక్కులు చెల్లింపు, బద్ది పోచమ్మకు పూజలు**



వేములవాడ అర్బన్, ఆగస్టు 8 (ఈవార్తలు): వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామివారిని 'రాజు వెడ్స్ రాంబాయి' చిత్ర కథానాయకుడు అఖిల్ రాజ్ శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భీమేశ్వర స్వామివారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించి, కోడె మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం బద్ది పోచమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ మండపంలో అర్చకులు, వేద పండితులు అఖిల్ రాజ్‌కు ఆశీర్వచనం అందించారు. ఆలయ అధికారులు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అఖిల్ రాజ్ మాట్లాడుతూ.. తెలంగాణలో పుట్టిన ప్రతి ఒక్కరికీ వేములవాడ రాజన్న గురించి తెలుసని అన్నారు. చిన్నతనం నుంచే వేములవాడ రాజన్నపై తనకు భక్తి ఉందని, అప్పటి నుంచి వేములవాడకు వచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నట్లు తెలిపారు. ఈసారి కూడా స్వామివారిని దర్శించుకుని అభిషేకం నిర్వహించి, కోడె మొక్కులు చెల్లించుకున్నానని చెప్పారు. ఆలయంలో తనకు చక్కటి ఆతిథ్యం, దర్శన ఏర్పాట్లు కల్పించిన సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి సంతోషంగా ఉందని అఖిల్ రాజ్ పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్న అధికారులను అభినందించారు. 'రాజు వెడ్స్ రాంబాయి' చిత్రానికి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించిందని అఖిల్ రాజ్ తెలిపారు. ప్రస్తుతం నటి అనుపమ పరమేశ్వరన్‌తో కలిసి 'క్రేజీ కళ్యాణం' చిత్రంలో నటించినట్లు వెల్లడించారు. వేములవాడ రాజన్న స్వామివారి ఆశీస్సులతో తనకు, తన చిత్రాలకు మంచి విజయం లభించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు.



## స్వీట్లపై 'బెస్ట్ బిఫోర్' తప్పనిసరి

**నిబంధనలు పాటించని వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి..సామాజిక వేత్త బాస ప్రకాశ్**

జగిత్యాల, ఆగస్టు 8 (ఈవార్తలు): స్వీట్ల విక్రయాల్లో వినియోగదారుల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్యాక్ చేయని స్వీట్లపైనా 'బెస్ట్ బిఫోర్' తేదీని తప్పనిసరిగా ప్రదర్శించే నిబంధనలను కఠినంగా అమలు చేయాలని లింకా బుక్ ఆఫ్ రికార్డ్స్ గ్రహీత, సామాజికవేత్త బాస ప్రకాశ్ కోరారు. జగిత్యాల ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎఫ్ఎస్ఎస్ఏఐ, 2020 సెప్టెంబర్ 25న జారీ చేసిన నిబంధనల ప్రకారం స్వీట్ల విక్రయాల్లో 'బెస్ట్ బిఫోర్' తేదీని వినియోగదారులకు స్పష్టంగా తెలియజేయాల్సి ఉందన్నారు. అయితే పలు ప్రాంతాల్లో ఈ నిబంధనలు పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని తెలిపారు. స్వీట్లు ఎంతకాలం వరకు వినియోగానికి సురక్షితంగా ఉంటాయో తెలుసుకునే హక్కు వినియోగదారులకు ఉందన్నారు. స్వీట్ షాపుల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి నిబంధనలను అమలు చేయాలని అధికారులను కోరారు. నిబంధనలు ఉల్లంఘించే ఫుడ్ బిజినెస్ ఆపరేటర్లపై ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్--2006 ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ అంశంపై దేశంలోని 36 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ఫుడ్ సేఫ్టీ కమిషనర్లకు లేఖలు పంపుతున్నట్లు బాస ప్రకాష్ తెలిపారు. వినియోగదారుల భద్రత దృష్ట్యా నిబంధనలను దేశవ్యాప్తంగా ఏకరీతిగా అమలు చేయాలని కోరారు.




## గ్రామాల అభివృద్ధికి ఎంపీ నిధులు: భోగ శ్రావణి



జగిత్యాల, ఆగస్టు 8 (ఈవార్తలు): జగిత్యాల నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి బోగ శ్రావణిని పలువురు సర్పంచులు శనివారం ఆమె నివాసంలో కలిశారు. గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించాలని కోరారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు, పారిశుద్ధ్యం, గ్రామీణ మౌలిక వసతుల పనులకు నిధుల కొరత ఉందని తెలిపారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులను గ్రామాల వారీగా కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సర్పంచుల వినతిపై బోగ శ్రావణి సానుకూలంగా స్పందించి, సమస్యలను కేంద్ర ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లి ఎంపీ ద్వారా నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జున్ను రాజేందర్, పొట్టవత్తిని సతీశ్, గంగన్న, అయోధ్య గంగాధర్, రవి, మహేష్, వంశీ, సంతోష్, స్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# డిజిటల్ చెల్లింపుల్లో స్టార్‌పే సంచలనం

## ఏఈపీఎస్, బీబీపీఎస్, డీఎంటీ, పీఓఎస్ సేవలు



(ఈవార్తలు-బిజినెస్ బ్యూరో)

హైదరాబాద్: డిజిటల్ చెల్లింపులు, ఆర్థిక సేవల రంగంలో స్టార్‌పే విస్తృత సేవలను అందిస్తోంది. హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న స్టార్‌పే దేశవ్యాప్తంగా వ్యాపారులు, చిల్లర వర్తకులు, సంస్థలు, వినియోగదారులకు అనుగుణంగా పలు డిజిటల్ ఆర్థిక పరిష్కారాలను అందిస్తోంది. ఆధార్ ఆధారిత చెల్లింపు వ్యవస్థ (ఏఈపీఎస్), భారత్ బిల్ పేమెంట్ సిస్టమ్ (బీబీపీఎస్), దేశీయ నగదు బదిలీ (డీఎంటీ), మైక్రో ఏటీఎం, పాయింట్ ఆఫ్ సేల్ (పీఓఎస్), పేమెంట్ గేట్‌వే సేవలను స్టార్‌పే అందిస్తోంది. వీటితో పాటు బ్యాంకింగ్ సాఫ్ట్‌వేర్, బీమా, ప్రయాణ సేవలకు సంబంధించిన సాంకేతిక అనుసంధానాలను కూడా అందిస్తోంది.

### వ్యాపారులకు ప్రత్యేక పరిష్కారాలు

చిన్నస్థాయి చిల్లర దుకాణాల నుంచి పెద్ద వ్యాపార సంస్థల వరకు వివిధ వర్గాలకు అవసరమైన చెల్లింపు సేవలను అందించేలా స్టార్‌పే తన సేవలను రూపొందించింది. డిజిటల్ లావాదేవీలను వేగంగా, సులభంగా నిర్వహించడంతో పాటు వ్యాపార కార్యకలాపాలను సమర్థంగా నిర్వహించేందుకు అవసరమైన సాంకేతిక పరిష్కారాలను అందిస్తోంది. భద్రత, వేగం, నిబంధనల అనుసరణకు ప్రాధాన్యం ఇస్తూ డిజిటల్ లావాదేవీల నిర్వహణకు అవసరమైన సాంకేతిక వేదికను అందిస్తున్నట్లు సంస్థ పేర్కొంది. వ్యాపార సంస్థల అవసరాలకు అనుగుణంగా సేవలను రూపొందించుకునే సౌకర్యాన్ని కూడా కల్పిస్తోంది.

### 1,800 మందికి పైగా క్లయింట్లు

స్టార్‌పే తన సేవల ద్వారా 1,800 మందికి పైగా క్లయింట్లను కలిగి ఉందని తెలిపింది. ఇప్పటివరకు 600కు పైగా ప్రాజెక్టులను పూర్తి చేసినట్లు పేర్కొంది. 200 మందికి పైగా నిపుణులతో కూడిన బృందం సంస్థలో పనిచేస్తున్నట్లు వెల్లడించింది. ఆర్థిక సేవలతో పాటు బీమా, ప్రయాణ టికెట్ బుకింగ్, ఈ-కామర్స్ చెల్లింపులు, మొబైల్, డీటీహెచ్ రీచార్జీలు, పాన్ కార్డు వోచర్లు, ఓటీటీ సేవలు తదితర విభాగాల్లోనూ స్టార్‌పే సేవలను అందిస్తోంది. డిజిటల్ చెల్లింపుల విస్తరణతో దేశంలో ఆర్థిక సేవలకు ప్రాప్యత పెరుగుతున్న నేపథ్యంలో సాంకేతికత ఆధారంగా మరింత వేగవంతమైన, సురక్షితమైన చెల్లింపు వ్యవస్థను అందించడమే తమ లక్ష్యమని స్టార్‌పే పేర్కొంది. వ్యాపారులు, సంస్థలు, వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా డిజిటల్ చెల్లింపులు, ఆర్థిక సేవలను ఒకే వేదికపై అందుబాటులోకి తీసుకురావడంపై సంస్థ దృష్టి సారించింది.



### 24 గంటల కస్టమర్ సేవలు

వ్యాపారులు, చిల్లర వర్తకులు, సంస్థల కోసం స్మార్ట్, సురక్షిత, విస్తరించగలిగే డిజిటల్ చెల్లింపు పరిష్కారాలను అందిస్తున్నాం. దేశవ్యాప్తంగా డిజిటల్ లావాదేవీలను మరింత వేగంగా, సులభంగా, విశ్వసనీయంగా నిర్వహించేందుకు సమగ్ర ఫిన్‌టెక్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చాం. భారత్ బిల్ పేమెంట్ సిస్టమ్ (బీబీపీఎస్), ఆధార్ ఆధారిత చెల్లింపు వ్యవస్థ (ఏఈపీఎస్), పేమెంట్ గేట్‌వే, పీఓఎస్ యంత్రాల సేవలను ఒకే వేదిక ద్వారా అందిస్తున్నాం. ఈ సేవల ద్వారా వ్యాపారులు తమ రోజువారీ చెల్లింపు లావాదేవీలను వేగంగా, సులభంగా నిర్వహించుకునే అవకాశం ఉంటుంది. డిజిటల్ చెల్లింపుల్లో భద్రత, వేగం, విశ్వసనీయతకు ప్రాధాన్యం ఇస్తున్నాం. వినియోగదారులకు నిరంతర సేవలు అందించేందుకు 24 గంటల కస్టమర్ సహాయ వ్యవస్థను ఏర్పాటు చేశాం. లావాదేవీల సమయంలో ఎదురయ్యే సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కస్టమర్ సేవల బృందం ఎప్పుడూ అందుబాటులో ఉంటుంది. ఈ మధ్యే గుంటూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకుతో ఒప్పందం చేసుకున్నాం.

- చల్లా మహేశ్, డైరెక్టర్, స్టార్ పే ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్

# వ్యాపారులపై నామమాత్రపు ఎండీఆర్

### వినియోగదారులకు మాత్రం సున్నా

### యూపీఐ చార్జీలపై కేంద్రం స్పష్టత

న్యూఢిల్లీ: యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లావాదేవీలపై వినియోగదారుల నుంచి ఎలాంటి రుసుములు వసూలు చేయబోమని కేంద్ర ప్రభుత్వం శనివారం స్పష్టం చేసింది. భవిష్యత్తులో వ్యాపార లావాదేవీల కోసం 'మర్చంట్ డిస్కౌంట్ రేట్' (ఎండీఆర్) అమలు చేసినప్పటికీ, అది కేవలం నిర్దిష్ట పరిమితికి మించిన లావాదేవీలపై మాత్రమే ఉంటుందని, అది కూడా నామమాత్రంగానే ఉంటుందని ఆర్థిక మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ యాక్ట్-2007కు ప్రతిపాదించిన సవరణలపై విస్తృత స్థాయిలో చర్చ జరుగుతున్న నేపథ్యంలో కేంద్రం ఈ స్పష్టతనిచ్చింది. యూపీఐ ద్వారా వ్యక్తుల మధ్య జరిగే లావాదేవీలు యథావిధిగా ఉచితంగానే కొనసాగుతాయని పేర్కొంది. వ్యాపారులపై అకస్మాత్తుగా ఎండీఆర్ భారం మోపబోమని, ఒకవేళ రుసుములు ప్రవేశపెట్టినా అవి డెబిట్ లేదా క్రెడిట్ కార్డులపై విధించే ఛార్జీల కంటే చాలా తక్కువగా ఉంటాయని వివరించింది.




యూపీఐ వ్యవస్థ దీర్ఘకాలిక మన్నికను కాపాడటంతో పాటు, సాంకేతిక అభివృద్ధి, సైబర్ భద్రతను మరింత బలోపేతం చేసే ఉద్దేశంతోనే ఈ సవరణలు చేపడుతున్నట్లు ప్రభుత్వం తెలిపింది. సదరు బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందిన అనంతరం, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నేతృత్వంలోని కమిటీ ఎండీఆర్ అమలుపై తుది నిర్ణయం తీసుకోనుంది. 2026 జులై నెలలో యూపీఐ ద్వారా రూ. 29.9 లక్షల కోట్ల విలువైన 2,366 కోట్ల లావాదేవీలు నమోదయ్యాయి. ఈ వ్యవస్థ శరవేగంగా విస్తరిస్తున్న క్రమంలో, దాని నిర్వహణకు, సాంకేతిక భద్రతకు నిరంతర పెట్టుబడులు అవసరమని అధికారులు పేర్కొన్నారు. ఇదే తరుణంలో వినియోగదారులకు యూపీఐ సేవలు ఎప్పటికీ ఉచితంగానే అందుతాయని ఫోన్‌పే సీఈఓ సమీర్ నిగమ్ సైతం స్పష్టం చేశారు. ఇప్పటికే పేమెంట్స్ కౌన్సిల్, ఫోన్ పే యాజమాన్యం కూడా యూపీఐ ఛార్జీలపై వివరణ ఇచ్చిన సంగతి తెలిసిందే.

### 2,000కు మించిన కొన్ని లావాదేవీలపై ఎండీఆర్ అవకాశం: ఫోన్ పే

యూపీఐ చెల్లింపులపై ఛార్జీలు పడతాయంటూ జరుగుతున్న చర్చకు ఫోన్‌పే సీఈఓ సమీర్ నిగమ్ తెరదించారు. సాధారణ వినియోగదారులు యూపీఐ ద్వారా డబ్బు పంపేందుకు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. "భారతీయ వినియోగదారులందరికీ యూపీఐ ఉచితంగానే ఉంటుంది" అని ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

# బీజేపీ-అకాలీదళ్ దోస్తీ!?

### మోదీతో సుఖ్‌బీర్ బాదల్ భేటీ.. డీలిమిటేషన్‌కు బాదల్ మద్దతు

చండీగఢ్: శిరోమణి అకాలీదళ్ (ఎస్ఏడీ) అధినేత సుఖ్‌బీర్ సింగ్ బాదల్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమైన మరుసటి రోజే కీలక రాజకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) ప్రక్రియకు బాదల్ మద్దతు ప్రకటించారు. దీంతో, పంజాబ్‌లో బీజేపీ - అకాలీదళ్ మధ్య మళ్లీ పొత్తు పొడుస్తోందనే చర్చలు ఊపందుకున్నాయి. ప్రధానితో జరిగిన భేటీ సానుకూలంగా జరిగిందని, పంజాబ్ అభివృద్ధి, రైతుల ప్రయోజనాలే ధ్యేయంగా కూటమి పునరుద్ధరణ దిశగా అడుగులు పడుతున్నాయని గుసగుసలు వినిపిస్తున్నాయి. గతంలో సాగు చట్టాల వివాదంతో ఎన్డీయే నుంచి బయటకు వచ్చిన అకాలీదళ్, ప్రస్తుతం పంజాబ్‌లో మారుతున్న రాజకీయ సమీకరణాల నేపథ్యంలో మళ్లీ కమలం పార్టీతో జతకట్టేందుకు ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. పార్లమెంట్ స్థానాల పునర్విభజనపై కేంద్రం తీసుకుంటున్న నిర్ణయాలకు మద్దతు పలకడం కూడా ఈ పొత్తు సంకేతాలలో భాగమేనని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ భేటీ పంజాబ్ రాజకీయాల్లో కొత్త మైత్రికి దారితీస్తుందనే చర్చలు జోరందుకున్నాయి.

# 100 అడుగుల లోయలోకి బస్సు.. ఏడుగురి మృతి

చంబా: హిమాచల్‌ప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. చంబా జిల్లాలో ప్రయాణికులతో వెళ్తున్న ప్రైవేటు బస్సు అదుపుతప్పి సుమారు 100 అడుగుల లోయలో పడిపోయింది. ఈ ఘటనలో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో 11 మంది తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో బస్సు డ్రైవర్, కండక్టర్ కూడా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. శర్మ ట్రావెలర్స్‌కు చెందిన బస్సు శనివారం ఉదయం సుమారు 6.30 గంటలకు బైరాగఢ్ నుంచి చంబా పట్టణానికి బయలుదేరింది. దాదాపు మూడు కిలోమీటర్లు ప్రయాణించిన తర్వాత చాలుజ్ మలుపు వద్ద ప్రమాదం జరిగింది. మలుపు తిప్పుతున్న సమయంలో డ్రైవర్ బస్సుపై నియంత్రణ కోల్పోవడంతో వాహనం రోడ్డుపై నుంచి జారి లోయలో పడినట్లు ప్రాథమిక సమాచారం. ప్రమాద స్థలానికి దిగువన ఉన్న మరో రోడ్డుపై బస్సు పడిపోయింది. ప్రమాద తీవ్రతకు వాహనం నుజ్జునుజ్జయింది. నుజ్జునుజ్జయిన బస్సులో చిక్కుకున్న బాధితులను బయటకు తీసేందుకు సహాయక బృందాలు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. గాయపడిన 11 మందిని తిస్సా పట్టణంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదానికి అసలు కారణం ఇంకా నిర్ధారణ కాలేదని చంబా జిల్లా ఎస్పీ విజయ్ సక్లానీ తెలిపారు. ప్రమాద సమయంలో సుమారు 20 నుంచి 25 మంది ప్రయాణికులు ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.



# యువత నాడీ అందని కాంగ్రెస్!



## యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం వేళ ఆత్మపరిశీలన అవసరం

## యువత ఏం ఆలోచిస్తుందో కాంగ్రెస్ వినాలి

## ఆ వినికిడి నుంచే పునరుజ్జీవనానికి అడుగు పడాలి

ఆగస్టు 9.. భారత యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం. దేశ రాజకీయాల్లో యువత పాత్రను గుర్తుచేసుకోవాల్సిన రోజు. కానీ అదే సమయంలో కాంగ్రెస్ పార్టీకి ఇది ఒక కీలకమైన ఆత్మపరిశీలన దినం కూడా. ఎందుకంటే దేశ జనాభాలో గణనీయమైన వాటా యువతదే అయినప్పటికీ.. ఆ యువత మనసులో ఏముంది? వారి ఆలోచనలు ఏమిటి? వారి ఆందోళనలు ఏమిటి? వారి రాజకీయ ఆకాంక్షలు ఏమిటి? అనే ప్రశ్నలకు కాంగ్రెస్ సమాధానాలు ఎంతవరకు సిద్ధంగా ఉన్నాయి అన్నది సందేహమే. ఒకప్పుడు యువత కాంగ్రెస్ వైపు ఆకర్షితమయ్యేది. స్వాతంత్ర్య ఉద్యమం నుంచి దేశ నిర్మాణం వరకు యువతను రాజకీయ ప్రక్రియలో భాగస్వాములను చేసిన చరిత్ర ఆ పార్టీకి ఉంది. విద్యార్థి ఉద్యమాలు, యువజన సంఘాలు, సామాజిక కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై పోరాటాలు.. ఇవన్నీ కాంగ్రెస్ రాజకీయ సంస్కృతిలో భాగంగా ఉండేవి.

కానీ కాలం మారింది. యువత మారింది. రాజకీయాల్ని చూసే దృష్టి మారింది. సమాచార సాంకేతికత యువత చేతిలోకి వచ్చింది. సామాజిక మాధ్యమాలు వారి రాజకీయ వేదికలయ్యాయి. కానీ కాంగ్రెస్ మాత్రం ఆ మార్పుకు తగ్గట్టుగా తన రాజకీయ సంభాషణను మార్చుకోవడంలో వెనుకబడిందనే విమర్శను ఎదుర్కొంటోంది. ఇది ప్రత్యర్థులు చేస్తున్న విమర్శ మాత్రమే కాదు. కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ కూడా యువతతో రాజకీయ పార్టీల అనుసంధానం ఎంత కీలకమో పదేపదే చెబుతున్నారు. ఇటీవల 'కాక్రోచ్ జనతా పార్టీ' అనే వ్యంగ్యాత్మక ఆన్‌లైన్ ఉద్యమం అనూహ్యంగా యువతను ఆకర్షించిన సందర్భంలో.. దాని వెనుక ఉన్న అసంతృప్తిని ప్రతిపక్షాలు అర్థం చేసుకోవాలని థరూర్ స్పష్టం చేశారు. యువతకు తమ అసంతృప్తిని వ్యక్తం చేసే వేదికలు అవసరమని, ఆ శక్తిని ప్రధాన రాజకీయ ప్రవాహంలోకి తీసుకురావాల్సిన బాధ్యత ప్రతిపక్షాలపై ఉందని పేర్కొన్నారు.

(ఈవార్తలు-పొలిటికల్ బ్యూరో)

### ఇదే కాంగ్రెస్‌కు అసలు పాఠం

యువతకు ఉపన్యాసాలు కాదు.. అవకాశాలు కావాలి. నినాదాలు కాదు.. పరిష్కారాలు కావాలి. సోషల్ మీడియా పోస్టులు కాదు.. ప్రత్యక్ష భాగస్వామ్యం కావాలి. నేటి యువత ఉద్యోగం గురించి ఆలోచిస్తోంది. మంచి విద్య, నైపుణ్యాలు, వ్యాపార అవకాశాలు, ఆర్థిక స్వావలంబన, కృత్రిమ మేధస్సు, సాంకేతిక మార్పులు, వాతావరణ సంక్షోభం, మానసిక ఒత్తిడి, పరీక్షల పారదర్శకత.. ఇలా ఎన్నో అంశాలపై ఆలోచిస్తోంది. రాజకీయ పార్టీలు మాత్రం ఇంకా పాత రాజకీయ భాషలోనే మాట్లాడితే ఆ తరం ఎందుకు ఆకర్షితమవుతుంది? ఇక్కడే కాంగ్రెస్ ప్రధానంగా విఫలమవుతోంది. భారతీయ జనతా పార్టీ యువతతో అనుసంధానానికి సామాజిక మాధ్యమాలను, డిజిటల్ ప్రచారాన్ని, ప్రత్యక్ష రాజకీయ కార్యక్రమాలను, బలమైన సంస్థాగత వ్యవస్థను విస్తృతంగా ఉపయోగించుకోగలిగింది. దానికి యువతలో ఎంత శాశ్వతమైన మద్దతు ఉందన్నది వేరే ప్రశ్న. కానీ యువతను చేరుకోవడానికి నిరంతరం ప్రయత్నించడం, వారి భాషలో మాట్లాడటం, డిజిటల్ వేదికలపై రాజకీయ కథనాలను నిర్మించడం వంటి అంశాల్లో బీజేపీ నుంచి కాంగ్రెస్ నేర్చుకోవాల్సిన పాఠాలు ఉన్నాయన్నది మాత్రం విస్మరించలేని వాస్తవం. అయితే కాంగ్రెస్ బీజేపీని అనుకరించడం పరిష్కారం కాదు. బీజేపీని ఓడించాలంటే బీజేపీలా మారాల్సిన అవసరం లేదు. యువతను అర్థం చేసుకోవాలి. నేటి యువతకు రాజకీయ సిద్ధాంతాల కంటే తమ భవిష్యత్తు గురించి ఎక్కువ ఆందోళన ఉంది. చదువు పూర్తయిన తర్వాత ఉద్యోగం దొరుకుతుందా? పోటీ పరీక్షలో పారదర్శకత ఉంటుందా? వ్యాపారం ప్రారంభించడానికి మూలధనం దొరుకుతుందా? కృత్రిమ మేధస్సు వల్ల ఉద్యోగాలపై ఎలాంటి ప్రభావం ఉంటుంది? వ్యవసాయ కుటుంబాల యువతకు భవిష్యత్తు ఏమిటి? నగరాల్లో జీవన వ్యయం ఎలా తగ్గుతుంది? ఇవే వారి అసలు ప్రశ్నలు.

ఈ ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చే రాజకీయ పార్టీ వైపు యువత సహజంగానే మొగ్గుచూపుతుంది. అందుకే కాంగ్రెస్ ముందుగా యూత్ కాంగ్రెస్‌ను కేవలం ఎన్నికల సమయంలో పనిచేసే రాజకీయ విభాగంగా కాకుండా, యువత సమస్యలకు నిరంతర వేదికగా మార్చాలి. ప్రతి జిల్లాలో యువతతో ప్రత్యక్ష సంభాషణలు నిర్వహించాలి. విద్యార్థులు, ఉద్యోగార్థులు, యువ పారిశ్రామికవేత్తలు, సాంకేతిక నిపుణులు, రైతు కుటుంబాల యువత, మహిళా యువత.. ఇలా భిన్న వర్గాలతో ప్రత్యేక వేదికలు ఏర్పాటు చేయాలి. యువత నుంచి సమస్యలు సేకరించి.. వాటిపై విధాన ప్రతిపాదనలు రూపొందించాలి. కేవలం ప్రభుత్వం తప్పులను ఎత్తిచూపడం కాకుండా.. 'మేము అధికారంలోకి వస్తే ఏం చేస్తాం?' అనే ప్రశ్నకు స్పష్టమైన సమాధానం ఇవ్వాలి. ఇంకా ముఖ్యంగా.. యువతకు పార్టీలో స్థానం ఇవ్వాలి. పోస్టర్లు మోసే కార్యకర్తలుగా కాదు. సమావేశాలకు జనాన్ని తరలించే శక్తిగా కాదు. నిర్ణయాలు తీసుకునే నాయకత్వంగా. టికెట్ కేటాయింపుల్లో యువతకు ప్రాధాన్యం, పార్టీ కమిటీల్లో యువ నాయకత్వానికి స్థానం, విధాన రూపకల్పనలో యువ నిపుణుల భాగస్వామ్యం.. ఇవి మాటల్లో కాకుండా ఆచరణలో కనిపించాలి. సామాజిక మాధ్యమాల్లో కూడా కాంగ్రెస్ తన పాత శైలిని మార్చుకోవాలి. నేటి యువతకు గంటసేపు ప్రసంగం కంటే ఒక నిమిషం స్పష్టమైన సందేశం ఎక్కువగా చేరుతుంది. కానీ ఆ సందేశంలో కేవలం ప్రత్యర్థిపై విమర్శలు ఉంటే ప్రయోజనం ఉండదు. ఉద్యోగం కోసం ఏం చేస్తారు? విద్య కోసం ఏం చేస్తారు? యువ పారిశ్రామికవేత్తలకు ఏం చేస్తారు? వంటి ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు ఉండాలి.

ఇటీవల యువతను ఆకర్షించిన కొన్ని కొత్త డిజిటల్ ఉద్యమాలు ప్రధాన రాజకీయ పార్టీలకు ఒక హెచ్చరికను ఇచ్చాయి. వాటి రాజకీయ భవిష్యత్తు ఎలా ఉన్నా.. వాటికి లభించిన స్పందనను తేలిగ్గా తీసుకోలేం. అది యువతలో ఉన్న అసంతృప్తికి, ప్రత్యామ్నాయ రాజకీయ స్వరాల కోసం ఉన్న ఆకాంక్షకు సంకేతం. ఈ అంశాన్ని శశిథరూర్ కూడా ప్రతిపక్షాలకు ఒక అవకాశంగా చూడాలని పేర్కొన్నారు. అందుకే ఆగస్టు 9న యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం కంటే.. ఆ రోజున కాంగ్రెస్ ఒక యువజన రాజకీయ పునరాలోచనకు శ్రీకారం చుట్టడం మరింత సముచితం. యువతను ఆకట్టుకోవడానికి భారీ సభలు సరిపోవు. వారి జీవితాల్లో మార్పు తీసుకొచ్చే విధానాలు కావాలి. యువతను ఓటర్లుగా మాత్రమే చూడటం మానేసి.. భవిష్యత్ భారత నిర్మాతలుగా చూడాలి. రాజకీయంగా కాంగ్రెస్‌కు ఇంకా అవకాశం ఉంది. కానీ ఆ అవకాశం స్వయంగా రాదు. యువత నాడిని పసిగట్టాలి. వారి భాషలో మాట్లాడాలి. వారి సమస్యలపై పోరాడాలి. పరిష్కారాలపై స్పష్టమైన కార్యాచరణను ప్రకటించాలి. లేకపోతే యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం ప్రతి ఏడాది ఒక వేడుకగానే మిగిలిపోతుంది. యువత మాత్రం తమ భవిష్యత్తు కోసం మరో రాజకీయ దారిని వెతుక్కుంటుంది. యువత ఎటు వెళ్తుందో తెలుసుకోవాలంటే.. ముందుగా యువత ఏం ఆలోచిస్తుందో కాంగ్రెస్ వినాలి. ఆ వినికిడి నుంచే పునరుజ్జీవనానికి తొలి అడుగు పడాలి.




ప్రియాంక జావల్కర్




## సూర్య విశ్వనాథ్ అండ్ సన్స్‌కు యూ/ఏ

తమిళ స్టార్ హీరో సూర్య నటిస్తున్న చిత్రం 'విశ్వనాథ్ అండ్ సన్స్' విడుదలకు సర్వం సిద్ధమైంది. తాజాగా ఈ సినిమా సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుని యూ/ఏ సర్టిఫికెట్‌ను పొందింది. స్వాతంత్ర్య దినోత్సవ వారాంతాన్ని పురస్కరించుకుని ఆగస్టు 14న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. 'లక్కీ భాస్కర్' వంటి చిత్రంతో మంచి పేరు తెచ్చుకున్న యువ దర్శకుడు వెంకీ అట్లూరి ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. ఇందులో సూర్య.. సంజయ్ విశ్వనాథ్ అనే 40 ఏళ్ల అంతర్జాతీయ పిస్టల్ షూటర్ పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, ట్రైలర్‌లో సూర్య స్టైలిష్ లుక్, అతడి నటన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా, స్టైల్, టైమింగ్ కామెడీ, భావోద్వేగాలను మిళితం చేస్తూ అతడి పాత్రను తీర్చిదిద్దిన విధానంపై ప్రశంసలు వస్తున్నాయి.

## టాక్సిక్ ట్రైలర్.. అంతా టాక్సికే!

కేజీఎఫ్ స్టార్ యశ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'టాక్సిక్: ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోనప్స్' ట్రైలర్ శనివారం విడుదలైంది. గ్యాంగ్‌స్టర్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం, తాజాగా విడుదలైన ట్రైలర్‌తో ఉత్కంఠభరితమైన యాక్షన్ సన్నివేశాలను పరిచయం చేసింది. గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహించిన ఈ సినిమా ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ ట్రైలర్‌ను అద్భుతమైన విజువల్స్, రోమాంచితమైన యాక్షన్ సీక్వెన్స్‌లతో



ఆకట్టుకునేలా రూపొందించారు. ప్రధానంగా రాయ (యశ్), అతని కుమారుడు టికెట్ మధ్య ఉన్న సంక్లిష్టమైన సంబంధాన్ని ఇందులో ఆవిష్కరించారు. కథలోని కీలక మలుపులను రహస్యంగా ఉంచుతూనే, "అరాచకం మరో అరాచకాన్ని కలిస్తే ఎలా ఉంటుంది" అనే ఆసక్తికరమైన థీమ్‌ను హైలైట్ చేశారు. నయనతార, కియారా అద్వానీ, తారా సుతారియా, రుక్మిణీ వసంత్, హుమా ఖురేషీ వంటి భారీ తారాగణం పోషించిన పాత్రలను సైతం ఈ ట్రైలర్‌లో పరిచయం చేయడం విశేషం. కన్నడ, ఆంగ్ల భాషల్లో ఏకకాలంలో తెరకెక్కిన ఈ చిత్రం, తెలుగు, తమిళం, హిందీ, మలయాళం భాషల్లోకి అనువాదమై విడుదల కానుంది. కేవీఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ సంస్థలు ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. గతంలో ఈ సినిమాకు సంబంధించి విడుదలైన ఒక లుక్‌లోని శ్మశాన వాటిక సన్నివేశం వివాదాస్పదమై ఎఫ్ఐఆర్ కూడా నమోదైన సంగతి తెలిసిందే. పలుమార్లు వాయిదా పడుతూ వచ్చిన ఈ సినిమా విడుదల తేదీని చిత్ర యూనిట్ ఫాదర్స్ డే సందర్భంగా అధికారికంగా ఖరారు చేసింది. ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్న ఈ టైలర్‌పై, ముఖ్యంగా సినిమా స్కేల్, యశ్ స్క్రీన్ ప్రెజెన్స్‌పై ప్రశంసల వర్షం కురుస్తోంది.


## 12న రవితేజ 'ఇరుముడి' ట్రైలర్




తాజా సమాచారం ప్రకారం ఆగస్టు 12న 'ఇరుముడి' ట్రైలర్‌ను విడుదల చేయనున్నారు. భీమవరంలోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఈ ట్రైలర్ లాంచ్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కార్యక్రమానికి చిత్ర బృందంతో పాటు అభిమానులు, సినీ ప్రేక్షకులు భారీగా హాజరయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే 'ఇరుముడి' నుంచి వచ్చిన ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై పాజిటివ్ వైబ్స్‌ను తీసుకొచ్చింది. దీంతో ట్రైలర్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. కుటుంబ భావోద్వేగాలు, భక్తి అంశాలతో పాటు రవితేజకు సంబంధించిన మాస్ ఎలివేషన్స్‌ను ట్రైలర్‌లో ఎలా చూపించారనేది ఆసక్తికరంగా మారింది.


## నేడు మహేశ్‌బాబు బర్త్ డే.. వారణాసి సర్‌ప్రైజ్ ఏంటో!

ఆదివారం సూపర్‌స్టార్ మహేశ్ బాబు పుట్టినరోజు సందర్భంగా ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కిస్తున్న పాన్ వరల్డ్ మూవీ 'వారణాసి' నుంచి అప్‌డేట్ వస్తుందా అని అటు మహేశ్ అభిమానులతో పాటు ఇటు టాలీవుడ్ ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే ప్రమోషన్స్‌లో గోప్యత పాటించే జక్కన్న స్ట్రాటజీ ప్రకారం, ఈసారి టీజర్‌కు బదులుగా కేవలం కొత్త పోస్టర్లు లేదా స్పెషల్ స్టిల్స్ మాత్రమే వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. అయితే దీనిపై చిత్రబృందం క్లారిటీ ఇవ్వవలసి ఉంది. ఆర్కియాలజిస్ట్ 'రుద్ర' పాత్రలో మహేశ్ బాబు నటిస్తున్న ఈ గ్లోబ్-ట్రాటింగ్ అడ్వెంచర్ థ్రిల్లర్ షూటింగ్ ఇప్పటికే 80 శాతం పూర్తయింది.



## చిల్లర వార్తలెందుకు?


బాలీవుడ్‌తో పాటు టాలీవుడ్‌లోనూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి మృణాల్ ఠాకూర్ గురించి గత కొంతకాలంగా ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. టీమిండియా యువ క్రికెటర్ యశస్వి జైస్వాల్‌తో ఆమె డేటింగ్‌లో ఉందంటూ నెట్టింట జోరుగా ప్రచారం జరిగింది. అయితే ఈ వార్తలపై తాజాగా మృణాల్ ఠాకూర్ స్వయంగా స్పందించి క్లారిటీ ఇచ్చారు. తనపై వస్తున్న పుకార్లపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ ఘాటైన సమాధానం ఇచ్చారు. ఇటీవల ముంబైలోని బాంద్రా ప్రాంతంలోని ఓ కేఫ్ నుంచి మృణాల్ ఠాకూర్, యశస్వి జైస్వాల్ వేర్వేరు సమయాల్లో బయటకు వస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీంతో వీరిద్దరి మధ్య ఏదో సంబంధం ఉందంటూ నెటిజన్లు ఊహాగానాలు మొదలుపెట్టారు. ఇద్దరూ కలిసి కనిపించకపోయినా.. ఒకే ప్రాంతంలో కనిపించడం డేటింగ్ రూమర్స్‌కు కారణమైంది. ఈ వార్తలు సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ కావడంతో చివరకు మృణాల్ స్పందించాల్సి వచ్చింది. యశస్వి జైస్వాల్‌తో మృణాల్‌ను లింక్ చేస్తూ ఇన్‌స్టాగ్రామ్‌లో చేసిన ఓ పోస్టుపై ఆమె ఘాటుగా స్పందించారు. నిరాధారమైన వార్తలను ప్రచారం చేయడంపై అసహనం వ్యక్తం చేస్తూ.. అసలు తన పక్కన యశస్వి ఎక్కడ ఉన్నాడో చూపించాలని ప్రశ్నించారు. చదువుకున్న వారు కూడా ఇలాంటి ఆధారాలు లేని వార్తలను ఎలా నమ్ముతున్నారో అర్థం కావడం లేదని ఆమె వ్యాఖ్యానించారు. దేశంలో ఎన్నో ముఖ్యమైన విషయాలు జరుగుతున్నాయని, వాటిపై దృష్టి పెట్టకుండా ఇలాంటి చిల్లర వార్తలకు ప్రాధాన్యత ఇవ్వడం సరికాదని సూచించారు.



## 104 డిగ్రీల జ్వరంతోనూ అవికాగోర్ షూటింగ్

చిన్నారి పెళ్లికూతురు ఫేమ్ అవికా గోర్ ప్రస్తుతం అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరారు. గత కొన్ని రోజులుగా తీవ్రమైన జ్వరంతో బాధపడుతున్న ఆమెకు వైద్య పరీక్షలు నిర్వహించగా డెంగ్యూ పాజిటివ్‌గా తేలింది. ప్రస్తుతం ఆమె ముంబైలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అవికా గోర్ భర్త మిలింద్ చంద్వానీ సోషల్ మీడియా వేదికగా ఆమె ఆరోగ్య పరిస్థితిని వెల్లడించారు. గత ఐదు రోజులుగా ఆమె ఏకంగా 104 డిగ్రీల జ్వరంతో బాధపడుతున్నప్పటికీ, షూటింగ్‌కు ఎలాంటి అంతరాయం కలగకూడదనే ఉద్దేశంతో తన వృత్తిపై ఉన్న అంకితభావాన్ని చాటుకున్నారు. నిర్మాతలకు నష్టం జరగకూడదనే ఆలోచనతో ఆమె తీవ్ర అనారోగ్యంలోనూ షూటింగ్‌లలో పాల్గొనడమే కాకుండా, ఒక యాడ్ షూట్ కోసం ఢిల్లీకి కూడా ప్రయాణించారు. అయితే నీరసం, జ్వరం మరింత పెరగడంతో ఆసుపత్రిలో చేరాల్సి వచ్చింది. ఆమె నటించిన సరికొత్త హిందీ మ్యూజిక్ ఆల్బమ్ 'బుఖార్' (జ్వరం) విడుదలైన రోజే ఆమె నిజంగానే జ్వరంతో ఆసుపత్రిపాలవడం గమనార్హం. ఆసుపత్రి మంచంపై నుంచే తన పాట విడుదలైన విషయాన్ని అభిమానులతో పంచుకున్న ఆమె, తన ప్లేట్‌లెట్ కౌంట్ తగ్గుతోందని, డెంగ్యూ ప్రభావం చాలా తీవ్రంగా ఉందని పేర్కొంటూ విక్టరీ సింబల్ చూపించారు. బాలనటిగా కెరీర్ ప్రారంభించి దేశవ్యాప్తంగా అపారమైన గుర్తింపు తెచ్చుకున్న అవికా గోర్ త్వరగా కోలుకోవాలని ఆమె అభిమానులు, సినీ ప్రముఖులు ఆకాంక్షిస్తున్నారు.

## నాని హీరోగా భాగ్యశ్రీ మువీ



అక్కినేని అఖిల్ హీరోగా వచ్చిన 'లెనిన్' సినిమా సక్సెస్‌తో ఫుల్ జోష్‌లో ఉన్న హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సేకి మరో క్రేజీ ఆఫర్ దక్కబోతున్నట్టు తెలుస్తోంది. నేచురల్ స్టార్ నాని హీరోగా సుజీత్ దర్శకత్వంలో తెరకెక్కనున్న 'బ్లడీ రోమియో' సినిమాలో భాగ్యశ్రీని హీరోయిన్‌గా తీసుకునే ఆలోచనలో మేకర్స్ ఉన్నట్టు సమాచారం. అయితే దీనిపై ఇంకా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. రవితేజ హీరోగా వచ్చిన 'మిస్టర్ బచ్చన్'తో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన భాగ్యశ్రీకి వరుసగా క్రేజీ సినిమాలు వచ్చాయి. కానీ ఆశించిన స్థాయిలో విజయాలు మాత్రం దక్కలేదు. 'లెనిన్'తో ఆమెకు తొలి సాలిడ్ హిట్ దక్కింది. ఈ సక్సెస్‌తో భాగ్యశ్రీ ప్రస్తుతం టాలీవుడ్‌లో వరుస అవకాశాలు అందుకుంటోంది.



# సాయి సుదర్శన్ దూరం?

## నంబర్-3 స్థానంపై టీమిండియాలో చర్చ

శ్రీలంకతో జరగనున్న రెండు టెస్టుల సిరీస్‌కు ముందు టీమిండియాకు మరో ఎదురుదెబ్బ తగిలింది. బ్యాటర్ సాయి సుదర్శన్ గాయం కారణంగా సిరీస్‌కు దూరమయ్యాడు. దీంతో కీలకమైన నంబర్-3 స్థానంపై జట్టు మేనేజ్‌మెంట్ మరోసారి ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది. టెస్టుల్లో సుదర్శన్ అరంగేట్రం చేసిన తర్వాత మూడో స్థానంలో భారత్ ప్రధాన ఎంపికగా మారాడు. అయితే ఆ స్థానాన్ని పూర్తిగా సుస్థిరం చేసుకోకముందే గాయం కారణంగా సిరీస్‌కు దూరమయ్యాడు. ప్రస్తుతం జరుగుతున్న వార్మప్ మ్యాచ్‌లో దేవదత్ పడిక్కల్ సెంచరీ చేయడంతో అతడికి మూడో స్థానంలో అవకాశం వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. సుదర్శన్‌కు ముందు స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా కూడా ఈ సిరీస్‌కు దూరమయ్యాడు. హర్షిత్ రాణా, నితీశ్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్ కూడా గాయాలతో అందుబాటులో లేరు. దీంతో శ్రీలంక పర్యటనకు భారత్ కీలక ఆటగాళ్లు లేకుండానే బరిలోకి దిగనుంది. సుదర్శన్ ఎంపిక సమయంలోనే అతడి ఫిట్‌నెస్‌పై సందేహాలు ఉన్నాయి. కాలి గాయం నుంచి కోలుకుంటున్న అతడికి సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ నుంచి ఫిట్‌నెస్ క్లియరెన్స్ రావాల్సి ఉంది. తాజాగా అతడు సిరీస్‌కు పూర్తిగా దూరమైనట్లు తేలింది. రెండు టెస్టుల సిరీస్ ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ పరంగా భారత్‌కు కీలకం. ప్రస్తుతం భారత్ ఐదో స్థానంలో ఉంది. శ్రీలంక ఆరో స్థానంలో ఉంది. 2027 డబ్ల్యూటీసీ ఫైనల్ రేసులో ముందుకు వెళ్లాలంటే ఇరు జట్లకు ఈ సిరీస్‌లో పాయింట్లు కీలకం. సుదర్శన్ గైర్హాజరీతో భారత్ బ్యాటింగ్ కూర్పులో మార్పులు తప్పనిసరయ్యాయి. పడిక్కల్ సెంచరీ చేయడంతో నంబర్-3 స్థానానికి పోటీ ఆసక్తికరంగా మారింది. మరోవైపు కీలక బౌలర్లు దూరం కావడంతో శ్రీలంక సిరీస్ టీమిండియా బెంచ్ బలానికి పరీక్షగా మారనుంది.



# కలిసొచ్చిన వార్మప్

శ్రీలంకతో టెస్టు సిరీస్‌కు సన్నాహక మ్యాచ్‌లో భారత జట్టు ఆదిలో తడబడినా చివరకు నిలబడింది. మూడు రోజుల వామప్ మ్యాచ్‌లో ప్రధాన ఆటగాళ్లు విఫలమైనా పడిక్కల్(142 నాటౌట్ ) భారీ శతకంతో రెచ్చిపోయాడు.

కేఎల్ రాహుల్(41), రవీంద్ర జడేజా(63 రిటైర్డ్ హర్ట్)లతో కీలక భాగస్వామ్యం నెలకొల్పిన పడిక్కల్.. ఆఖరి ఓవర్ వరకూ క్రీజునంటుకు పోయాడు. మానవ్ సుతార్(41) సైతం గొప్పగా ఆడడంతో టీమిండియాను ఆలౌట్ చేయాలనుకున్న లంక బౌలర్ల ఆశలు ఆవిరయ్యాయి.





## పడిక్కల్ భారీ శతకం.. జడ్డూ, సుతార్ జోరు.. కుదేలైన లంక బౌలర్లు

వామప్ మ్యాచ్‌లో భారత బ్యాటర్ దేవ్‌దత్ పడిక్కల్((142 నాటౌట్) శతకంతో భారీ స్కోరందించాడు. ఓపెనర్ యశస్వీ జైస్వాల్(0) డకౌటైన తర్వాత క్రీజులోకి వచ్చిన పడిక్కల్ మూడో స్థానంలో నేను ఆడగలను అని చాటుకుంటూ శతకంతో చెలరేగాడు. కేఎల్ రాహుల్(40), రవీంద్ర జడేజా(63 రిటైర్డ్ హర్ట్)లతో కలిసి కీలక భాగస్వామ్యాలు నెలకొల్పిన ఈ కుర్రాడు లంక బౌలర్లను విసిగించాడు. యశస్వీ వికెట్ అనంతరం రాహుల్, పడిక్కల్ దూకుడుగా ఆడారు. అర్ధ శతక భాగస్వామ్యంతో లంక బౌలర్ల సహనాన్ని పరీక్షించిన ఈ ద్వయాన్ని కేశర నువాంత(1-40) విడదీశాడు. ఆ తర్వాత వచ్చిన రిషభ్ పంత్(2), ధ్రువ్ జురెల్(1) లు విఫలమైన చోట క్రీజునంటుకున్న పడిక్కల్ ఒత్తిడికి లోనవ్వకుండా స్కోర్ బోర్డును నడిపించాడు. ఆఖర్లో మానవ్ సుతార్(41) సైతం రాణించగా భారత్ స్కోర్ దాటింది. అనంతరం గుర్నూర్ బ్రార్(36 నాటౌట్) జతగా లంక ఎక్స్‌ఐ బౌలర్లను కాచుకున్న పడిక్కల్ అజేయంగా నిలిచాడు. దాంతో, రెండో రోజు ఆట ముగిసే సరికి టీమిండియా 6 వికెట్ల నష్టానికి 357 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో ఇంకా 6 రన్స్ వెనకబడి ఉ ఒదంతే. మొదట బ్యాటింగ్ చేసిన లంక 363-8 వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. ఆదివారం ఆఖరి రోజు కావడంతో వామప్ మ్యాచ్ డ్రాగా ముగియడం ఖాయం.





# జాగా కావాలన్న పంత్.. ఓకే అన్న సీఎం

భారత క్రికెట్ జట్టు వికెట్ కీపర్-బ్యాటర్ రిషబ్ పంత్ తన స్వరాష్ట్రమైన ఉత్తరాఖండ్‌లో భూమి కొనుగోలు చేసేందుకు సహాయం చేయాలని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామిని సోషల్ మీడియా వేదికగా కోరాడు. పంత్ విజ్ఞప్తిపై సీఎం సానుకూలంగా స్పందించి, పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఈ సంభాషణ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ప్రస్తుతం శ్రీలంక పర్యటనలో ఉన్న రిషబ్ పంత్, తాను ఢిల్లీ నుంచి తన సొంత రాష్ట్రానికి మకాం మార్చి, తన మొదటి ఇల్లు కట్టుకోవాలనుకుంటున్నట్లు 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతాలో పోస్ట్ చేశాడు. "గత మూడేళ్లుగా సరైన స్థలం కోసం ప్రయత్నిస్తున్నాను. కానీ ఈ ప్రక్రియలో ఎదురవుతున్న ఇబ్బందులు, స్పష్టత లేకపోవడం ఒక పీడకలలా మారింది. నా పహాడీ ప్రజల మధ్య జీవించాలని, రాష్ట్రానికి సేవ చేయాలని ఉంది" అని పేర్కొంటూ సీఎం సహాయాన్ని అభ్యర్థించాడు. అయితే, మరో పోస్ట్‌లో పంత్ ఒక స్పష్టత ఇచ్చాడు. అంతర్జాతీయంగా రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించినందుకు బహుమతిగా భూమి ఇస్తే సంతోషమే అయినా, తాను మాత్రం ప్రభుత్వ నిబంధనల ప్రకారం వర్తించే ధరలకే భూమిని కొనుగోలు చేయాలనుకుంటున్నట్లు తెలిపాడు. పంత్ పోస్ట్‌పై సీఎం పుష్కర్ సింగ్ ధామి స్పందించారు. 'రిషబ్ పంత్ ఉత్తరాఖండ్ గర్వకారణం' అని ప్రశంసించారు. నిబంధనల ప్రకారం అన్ని విధాలా సహకరించాలని సంబంధిత అధికారులను ఆదేశించామని, వారు త్వరలోనే పంత్‌ను సంప్రదిస్తారని ఆయన బదులిచ్చారు. "ప్రియమైన రిషబ్.. మీరు ఉత్తరాఖండ్‌కు గర్వకారణం. మీ అద్భుతమైన ప్రదర్శన, విజయాలతో మీరు దేశంలో, ప్రపంచంలో దేవభూమి పేరును ప్రకాశింపజేశారు. మీ మాతృభూమిపై మీకున్న ప్రేమ, ఇక్కడికి తిరిగి వచ్చి సేవ చేయాలనే మీ ఆకాంక్ష ఎంతో ప్రశంసనీయం.




# ఇంగ్లండ్ హెడ్‌కోచ్‌గా ఫ్లింటాఫ్ గుడ్ బై

ఇంగ్లండ్ వెటరన్ ఆండ్రూ ఫ్లింటాఫ్ కోచింగ్ బాధ్యతల నుంచి వైదొలిగాడు. తమ దేశానికి చెందిన జూనియర్ టీమ్ ఇంగ్లండ్ లయన్స్‌కు కోచింగ్ ఇస్తున్న ఈ మాజీ ఆల్‌రౌండర్ తన పదవికి రాజీనామా చేశాడు. రెండేళ్లుగా ఆ జట్టును తీర్చిదిద్దిన ఫ్లింటాఫ్ ఆగస్టు 8, శనివారంతో తన సేవలకు స్వస్తి పలికాడు. ఇకపై ఫ్రాంచైజీ క్రికెట్‌లో కోచ్‌గా కొనసాగనున్నాడు. 'లయన్స్ కోచ్‌గా వైదొలగాలని దురదృష్టవశాత్తూ నిర్ణయం తీసుకున్నా. దేశంలోని యువ క్రికెటర్లతో సమయం గడపడం, వారికి శిక్షణ ఇచ్చే అవకాశాన్ని నేను ఎంతో ఆస్వాదించాను. వారిని మరింత ఉన్నత స్థాయిలో చూడాలనుకున్నా. తదుపరి సిడ్నీ థండర్స్‌కు ప్రధాన కోచ్‌గా సేవలందించేందుకు నేను ఇక వేచి ఉండలేకపోతున్నా' అని ఫ్లింటాఫ్ పేర్కొన్నాడని ఇంగ్లండ్ వేల్స్ క్రికెట్ బోర్డు వెల్లడించింది. లయన్స్ హెడ్‌కోచ్‌గా 2004 సెప్టెంబర్‌లో ఫ్లింటాఫ్ బాధ్యతలు చేపట్టాడు.



# హండ్రెడ్ లీగ్ నుంచి జెమీమా ఔట్

భారత మహిళా క్రికెట్ జట్టు స్టార్ బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ కీలకమైన హండ్రెడ్ లీగ్ నుంచి మధ్యలోనే వైదొలిగింది. హ్యామ్‌స్ట్రింగ్ గాయం కారణంగా ఆమె భారత్‌కు తిరిగి రానుంది. త్వరలో జరుగబోయే ఆసియా కప్‌కు కూడా ఆమె అందుబాటులో ఉండే అవకాశం లేదని తెలుస్తోంది. హండ్రెడ్ లీగ్‌లో జెమీ సదర్న్ బ్రేవ్‌కు ప్రాతినిధ్యం వహిస్తోంది. ఆమె కోసం ఫ్రాంచైజీ ఏకంగా 60,000 పౌండ్లు చెల్లించింది. అయితే గాయం కారణంగా టోర్నీలో మిగిలిన మ్యాచ్‌లకు ఆమె దూరం కానుంది. జెమీమా స్థానంలో ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ చార్లీ నాట్‌ను సదర్న్ బ్రేవ్ ఎంపిక చేసింది. ఈ సీజన్‌లో జెమీమా 6 మ్యాచ్‌ల్లో 143 పరుగులు చేసింది. ఆమె సగటు 35.75గా ఉంది. ఒక్క అర్ధశతకం కూడా నమోదు చేయకపోయినా వరుసగా మూడు మ్యాచ్‌ల్లో 25కు పైగా పరుగులు సాధించింది.

# మెస్సీ తండ్రి కన్నుమూత

ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీ ఇంట తీవ్ర విషాదం చోటు చేసుకుంది. మెస్సీ తండ్రి జార్జ్ హొరాసియో మెస్సీ (68) కన్నుమూశారని పలు అంతర్జాతీయ మీడియా సంస్థలు వెల్లడించాయి. జార్జ్ మెస్సీ అర్జెంటీనాలోని రొసారియోలో శుక్రవారం రాత్రి తుదిశ్వాస విడిచినట్లు సమాచారం. జార్జ్ మెస్సీ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. అయితే ఆయన మృతికి గల ఖచ్చితమైన కారణాన్ని ఎవరూ వెల్లడించలేదు. లియోనెల్ మెస్సీ ఫుట్‌బాల్ ప్రయాణంలో జార్జ్ మెస్సీ పాత్ర ఎంతో కీలకం. చిన్నతనం నుంచే తన కుమారుడి కెరీర్‌ను దగ్గరుండి పర్యవేక్షించిన ఆయన, మెస్సీ ప్రొఫెషనల్ ఫుట్‌బాల్‌లోకి అడుగుపెట్టిన తర్వాత కూడా అతడి ప్రతినిధిగా, సలహాదారుగా వ్యవహరించారు. మెస్సీ చిన్న వయసులోనే స్పెయిన్‌లోని బార్సిలోనాకు వెళ్లిన సమయంలో కూడా జార్జ్ ఆయన వెంట ఉన్నారు. అనంతరం మెస్సీ కెరీర్‌కు సంబంధించిన ఆర్థిక, వృత్తిపరమైన వ్యవహారాల్లోనూ ఆయన కీలక పాత్ర పోషించారు.

# క్రికెటర్లకు ఎందుకీ గాయాలు?

## నేడు బెంగళూరులో బీసీసీఐ అత్యవసర భేటీ

భారత క్రికెటర్లు తరచూ గాయాల బారిన పడడం.. సిరీస్ మధ్యలోనే స్క్వాడ్ నుంచి వైదొలగడం చూస్తున్నాం. ప్రధాన పేసర్ జస్ప్రీత్ బుమ్రా, సాయి సుదర్శన్‌లు చివరకు శ్రీలంక పర్యటన మొత్తానికి దూరమవ్వడం పట్ల బీసీసీఐ ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. అసలు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఏం జరుగుతోంది? ఆటగాళ్లు ఎందుకు త్వరగా కోలుకోవడం లేదు? అనే అంశంపై అత్యవసర సమీక్షకు సిద్ధమవుతోంది బీసీసీఐ. విదేశీ పర్యటనల్లో భారత ఆటగాళ్లు ఈమధ్య తరచూ గాయపడుతున్నారు. ఫలితంగా.. కొత్త కాంబినేషన్లు ప్రయత్నించడం, అవి బెడిసికొట్టి జట్టు విజయావకాశాల్ని దెబ్బతీయడం మామూలైపోయింది. పునరావాసంలో ఉండి.. ఫిట్‌గా తిరిగి వస్తారనుకుంటే.. బరువెక్కి కొందరు, గాయాలు నయమవ్వక కొందరు కీలక సిరీస్‌లకు దూరమవుతున్నారు. శ్రీలంక పర్యటనకు బుమ్రాతో పాటు సాయి సుదర్శన్ అందుబాటులో లేకపోవడంపై ఆగ్రహించిన భారత క్రికెట్ నియంత్రణ మండలి అత్యవసర సమీక్ష చేయనుంది. దాంతో, బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా హుటా హుటిన శనివారమే బెంగళూరుకు బయల్దేరాడు. అక్కడ సీఓఈ డైరెక్టర్ వీవీఎస్ లక్ష్మణ్‌తో ఆదివారం అతడు రిహాబిలిటేషన్ తీరుతెన్నులు పరిశీలించి.. అసలేం జరుగుతుందో తెలుసుకోనున్నాడు.



ఈవార్తలు

# ప్రజావాణి

ఆదివారం 9-8-2026, జగిత్యాల

ఈవార్తలు





8 జనవరి 2024.. సీఎస్ శాంతి కుమారి.. కోర్టు ధిక్కరణ
2025 మే.. ఐఏఎస్ సీ నారాయణరెడ్డి.. సుమోటో కోర్టు ధిక్కరణ
20 జనవరి 2026.. ఐఏఎస్ రాహుల్ బొజ్జ.. వ్యక్తిగత హాజరు/సమన్లు
21 జనవరి 2026.. ఐపీఎస్ సీవీ ఆనంద్.. సుమోటో కోర్టు ధిక్కరణ
27 జూలై 2026.. ఐపీఎస్ ఏవీ రంగనాథ్.. కోర్టు ధిక్కరణ
7 ఆగస్టు 2026.. ఐఏఎస్ సందీప్ కుమార్ సుల్తానియా.. కోర్టు ధిక్కరణ
8 ఆగస్టు 2026.. ఐఏఎస్ జయేశ్ రంజన్.. కోర్టు ధిక్కరణ

..ఇలా చెప్పుకుంటూ పోతే,
న్యాయస్థానాల మొట్టికాయలు..!
అధికారులకు తిట్ల దండలు..!!

ఒకరికి నోటీసు..
ఇంకొకరికి వ్యక్తిగత హాజరు..
మరొకరికి జరిమానా/శిక్ష..
వేరొకరికి బెయిలబుల్ వారెంట్..
..పదవి నుంచి తప్పించాలని ఆదేశాలు
ఎందుకీ ఆదేశాలు, ధిక్కరణలు..?
అధికార 'మదమా'?
అధికారుల్లో 'మథనమా'?

# మదమా..
# మథనమా..!?



శ్రావణ్ కుమార్ బొమ్మకంటి
ఎడిటర్, ఎంటెక్, ఎల్ఎల్‌బీ
ఫోన్ నంబర్: 9581291919.

ప్రజాస్వామ్య వ్యవస్థలో అధికారానికి హద్దులు ఉన్నాయి.
రాజ్యాంగం ప్రతి వ్యవస్థకు తన పరిధిని నిర్దేశించింది.
శాసన వ్యవస్థ.. చట్టాలు చేస్తుంది.
కార్యనిర్వాహక వ్యవస్థ.. వాటిని అమలు చేస్తుంది.
న్యాయవ్యవస్థ.. రాజ్యాంగ హక్కులను కాపాడుతుంది.

ఈ మూడు వ్యవస్థల మధ్య సమతుల్యతే రాజ్యాంగ ప్రజాస్వామ్యానికి పునాది. అయితే ఒక వ్యవస్థ ఇచ్చిన ఆదేశాన్ని మరో వ్యవస్థ పట్టించుకోకపోతే ఆ సమతుల్యతకు అర్థమేంటి? తెలంగాణలో ఇటీవలి కాలంలో హైకోర్టు ఆదేశాల అమలుపై నమోదవుతున్న కోర్టు ధిక్కరణ కేసులు ఇదే ప్రశ్నను ముందుకు తెస్తున్నాయి. ముఖ్యంగా ఉన్నతాధికారులు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల పేర్లు కోర్టు ధిక్కరణ వ్యవహారాల్లో తరచూ వినిపించడం ఆందోళన కలిగిస్తున్నాయి. కోర్టు ఆదేశాలు అమలు కాకపోవడంతో నోటీసులు ఇవ్వడం, వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆదేశించడం, వివరణ కోరడం, కొన్ని సందర్భాల్లో కఠిన చర్యలకు సిద్ధపడటం.. ఇవన్నీ పరిపాలన వ్యవస్థలో ఎక్కడో ఒకచోట తీవ్రమైన లోపం ఉందని సూచిస్తున్నాయి. హైకోర్టు ఆదేశాన్ని అమలు చేయకుండా కాలయాపన చేయడం, ఫైళ్లను ఒక శాఖ నుంచి మరో శాఖకు తిప్పడం, బాధ్యతను కింది స్థాయి అధికారులపైకి నెట్టడం, కోర్టు ఆదేశంలోని అనుకూల భాగాన్ని మాత్రమే అమలు చేసి మిగిలిన భాగాన్ని విస్మరించడం.. ఇవన్నీ పరిపాలన సంస్కృతిలో ప్రమాదకరమైన ధోరణులు. కోర్టు ధిక్కరణ కేసులు పెరగడం వెనుక ఇలాంటి కారణాలు ఉంటే, సమస్య కేవలం వ్యక్తిగత అధికారులది కాదు; అది మొత్తం పాలనా వ్యవస్థను ఆత్మపరిశీలన చేసుకునే పరిస్థితి. తెలంగాణలో గత కొన్నేళ్లలో కోర్టు ధిక్కరణ వ్యవహారాల్లో ఉన్నతాధికారులపై నోటీసులు జారీ అయిన సందర్భాలు ఉన్నాయి. భూ వివాదాలు, ప్రభుత్వ ఉద్యోగుల సేవా ప్రయోజనాలు, పరిహారం చెల్లింపులు, నియామకాలు, సమాచార హక్కు, ప్రభుత్వ బిల్లుల చెల్లింపులు, పోలీసు చర్యలు, సినిమా టికెట్ ధరలు వంటి విభిన్న అంశాల్లో హైకోర్టు ఆదేశాల అమలుపై వివాదాలు కోర్టుకు చేరాయి. కొన్ని కేసుల్లో అధికారులు ఆదేశాలను తరువాత అమలు చేయడంతో ధిక్కరణ కేసులు ముగిశాయి. మరికొన్ని కేసుల్లో కోర్టు వ్యక్తిగత హాజరు ఆదేశాలు ఇచ్చింది. అత్యంత తీవ్రమైన సందర్భాల్లో శిక్షలు, వారెంట్లు వంటి చర్యలు కూడా వెలుగుచూశాయి.

**ఇది ప్రభుత్వ అధికారులకు ఒక స్పష్టమైన హెచ్చరిక..**

**కోర్టు ఆదేశం ఒక సూచన కాదు.. అది పాటించాల్సిన ఆదేశం.**

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 141 ప్రకారం సుప్రీంకోర్టు ప్రకటించే చట్టం దేశంలోని అన్ని కోర్టులకు బద్ధమైనది. అలాగే రాజ్యాంగంలోని ఆర్టికల్ 144 ప్రకారం దేశంలోని అన్ని సివిల్, జ్యుడీషియల్ అథారిటీలు సుప్రీంకోర్టుకు సహకరించాలి. హైకోర్టుల ఆదేశాల అమలు కూడా రాజ్యాంగబద్ధ పరిపాలనలో అంతర్భాగమే. దీనికి తోడు కంటెప్ట్ ఆఫ్ కోర్ట్స్ యాక్ట్-1971 కోర్టు ఆదేశాల ఉద్దేశపూర్వక అవిధేయతను కోర్టు ధిక్కరణగా పరిగణించే చట్టపరమైన వ్యవస్థను కల్పించింది. ప్రభుత్వ యంత్రాంగంలో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులది అత్యంత కీలకమైన బాధ్యత. వారు కేవలం ఫైళ్లను కదిలించే అధికారులు కాదు.. ప్రభుత్వ విధానాలను అమలు చేయాలి. ప్రజలకు సేవలు అందించాలి. శాంతిభద్రతలను కాపాడాలి. సంక్షేమ పథకాలను అమలు చేయాలి. అదే సమయంలో రాజ్యాంగం, చట్టాలు, న్యాయస్థానాల ఆదేశాలకు లోబడి పనిచేయాలి. ఈ మూడు బాధ్యతలను సమన్వయం చేయడం అంత సులభమైన పని కాదు. ముఖ్యంగా రాజకీయ నిర్ణయాలు, ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లు, పరిపాలనా పరిమితులు, న్యాయస్థానాల ఆదేశాల మధ్య అధికారుల పరిస్థితి అనేక సందర్భాల్లో కత్తిమీద సాములా మారుతోంది. ఎందుకంటే ఒక ఐఏఎస్ అధికారి పనిచేసేది శూన్యంలో కాదు. ఆయనకు పైస్థాయిలో ప్రభుత్వం ఉంటుంది. ఎన్నికైన ప్రజాప్రతినిధులు ఉంటారు. మంత్రుల ఆదేశాలు ఉంటాయి. రాజకీయంగా సున్నితమైన నిర్ణయాలు ఉంటాయి. శాఖాపరమైన నిబంధనలు ఉంటాయి. మరోవైపు న్యాయస్థానాల ఆదేశాలు ఉంటాయి. ఈ విభిన్న కేంద్రాల మధ్య సమన్వయం చేయాల్సిన బాధ్యత అధికారిపైనే పడుతుంది. ప్రజాస్వామ్యంలో ప్రజలచే ఎన్నికైన ప్రభుత్వం పాలన చేయాలి. ప్రజాప్రతినిధుల నిర్ణయాలను అధికార యంత్రాంగం అమలు చేయడం సహజమైన పరిపాలనా ప్రక్రియ. అయితే ఆ నిర్ణయాలు రాజ్యాంగం, చట్టాలకు లోబడి ఉండాలి. ఇక్కడే అసలు చిక్కు మొదలవుతుంది.

శ్రావణ వాణి

రాజకీయ ఆదేశం ఒకటి..
రాజ్యాంగబద్ధ బాధ్యత మరొకటి..
న్యాయస్థానం ఆదేశం ఇంకొకటి..
అయినప్పుడు అధికారి ఎటువైపు నిలబడాలి?
సమాధానం.. రాజ్యాంగమే!
అధికారి ప్రభుత్వానికి విధేయుడిగా ఉండాలి.

కానీ వ్యక్తిగతంగా ఏ రాజకీయ నాయకుడికీ విధేయుడిగా ఉండాల్సిన అవసరం లేదు. ప్రభుత్వ నిర్ణయాన్ని అమలు చేయాలి. కానీ చట్టవిరుద్ధమైన ఆదేశాన్ని అమలు చేయడం ఆయనకు రక్షణ కవచం కాదు. న్యాయస్థానం ఆదేశం వచ్చిన తర్వాత దాన్ని అమలు చేయడం ఆయన రాజ్యాంగబద్ధ బాధ్యత.ఇదే కారణంగా ఐఏఎస్, ఐపీఎస్ అధికారులపై పడుతున్న ఒత్తిడిని అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఒకవైపు ప్రభుత్వ నిర్ణయాలను అమలు చేయాలి. మరోవైపు కోర్టులో ఆ నిర్ణయాన్ని సమర్థించాలి. రాజకీయంగా తీసుకున్న నిర్ణయానికి పరిపాలన బాధ్యత అధికారిపైనే పడుతుంది. ఫలితంగా నిర్ణయం తీసుకున్నవారు రాజకీయంగా బయటపడిపోయినా, ఫైల్‌పై సంతకం చేసిన అధికారి మాత్రం బోనులో నిల్చోవాల్సి వస్తోంది. ఇది పరిపాలన వ్యవస్థలోని ఒక తీవ్రమైన విరోధాభాసం. రాజకీయ నిర్ణయానికి రాజకీయ బాధ్యత.. పరిపాలనా అమలుకు పరిపాలనా బాధ్యత.. చట్ట ఉల్లంఘనకు చట్టపరమైన బాధ్యత.. ఈ మూడు స్పష్టంగా వేరు కావాలి. లేకపోతే అధికారులపై ఒత్తిడి పెరుగుతూనే ఉంటుంది. వారు ఒకవైపు రాజకీయ పెద్దల ఆదేశాలను పాటించాల్సి వస్తుంది. మరోవైపు కోర్టు ధిక్కరణ కేసులను ఎదుర్కోవాల్సి వస్తుంది. చివరకు వ్యవస్థలో పనిచేసే అధికారి 'ఎటు వెళ్లినా తప్పే' అనే పరిస్థితికి చేరుకుంటాడు.

కానీ ఈ పరిస్థితికి మరో ముఖం కూడా ఉంది.
ఆ ఒత్తిడి ఫలితంగా నష్టపోయేది ఎవరు?
సామాన్య పౌరుడే.

కోర్టు ఆదేశం ఉన్నా పరిహారం అందకపోతే రైతు నష్టపోతాడు. న్యాయస్థానం ఆదేశించినా ఉద్యోగ హక్కు అమలు కాకపోతే ఉద్యోగి నష్టపోతాడు. భూమి వివాదంలో ఆదేశాలు అమలు కాకపోతే బాధితుడు సంవత్సరాల తరబడి న్యాయం కోసం తిరగాల్సి వస్తుంది. ప్రభుత్వ కార్యాలయంలో కోరిన సమాచారం అందకపోతే సమాచార హక్కు చట్టం ఉద్దేశమే దెబ్బతింటుంది. అందుకే బాధితులు చివరికి కోర్టు మెట్లు ఎక్కుతున్నారు. న్యాయస్థానం వారికి చివరి ఆశ్రయంగా మారుతోంది. ఇక్కడే తెలంగాణ హైకోర్టు అనేక సందర్భాల్లో అధికారులపై తీవ్రంగా స్పందిస్తోంది. ఇది అధికారులను అవమానించడానికి కాదు. ప్రజలకు న్యాయం అందించేందుకు. కోర్టు ఇచ్చిన ఆదేశం అమలు కాకపోతే, ఆ ఆదేశం వెనుక ఉన్న పౌరుడి హక్కు కూడా అమలు కానట్టే. న్యాయస్థానం జోక్యం చేసుకోవాల్సిన పరిస్థితి అక్కడే ఏర్పడుతుంది. అయితే కోర్టు ధిక్కరణ చట్టానికి కూడా ఒక ముఖ్యమైన సూత్రం ఉంది. ప్రతి ఆలస్యం ధిక్కరణ కాదు. ప్రతి తప్పిదం ఉద్దేశపూర్వక అవిధేయత కాదు. 'విల్‌ఫుల్ డిస్‌ఒబీడియన్స్' ఉన్నప్పుడే ధిక్కరణకు శిక్షార్హత వస్తుంది.

ఆదేశం స్పష్టంగా ఉందా? దాన్ని అమలు చేసే సామర్థ్యం అధికారికి ఉందా? అమలుకు నిజాయతీగా ప్రయత్నించారా? అప్పీల్ చేశారా? పరిస్థితులు మారాయా? వంటి అంశాలను న్యాయస్థానం పరిశీలిస్తుంది. అదే సమయంలో రాజకీయ ఒత్తిడి పేరుతో రాజ్యాంగ బాధ్యత నుంచి తప్పించుకోవడానికి కూడా అవకాశం లేదు. ఇది అత్యంత కీలకమైన విషయం.

ఒక అధికారి తనపై రాజకీయ ఒత్తిడి ఉందని కోర్టులో చెప్పవచ్చు. తనను ఎవరు ఏ ఆదేశం ఇచ్చారో రికార్డులో పెట్టవచ్చు. చట్టవిరుద్ధమైన ఆదేశమైతే దాన్ని లిఖితపూర్వకంగా కోరవచ్చు. అవసరమైతే చట్టపరమైన సలహా తీసుకోవచ్చు. ప్రభుత్వ నిర్ణయం న్యాయస్థానంలో సవాల్‌కు గురైతే దాని పరిణామాలను కూడా ప్రభుత్వం ఎదుర్కోవాలి. కానీ కోర్టు ఆదేశం వచ్చిన తర్వాత దాన్ని అమలు చేయకుండా ఉండటానికి రాజకీయ ఒత్తిడి శాశ్వత రక్షణ కాదు. ఎందుకంటే అధికారికి రాజ్యాంగమే అంతిమ రక్షణ.. అంతిమ బాధ్యత కూడా. ఇక్కడ ప్రభుత్వాల బాధ్యత కూడా చాలా పెద్దది. ఒక నిర్ణయం రాజకీయంగా తీసుకుని, దాని అమలు బాధ్యతను పూర్తిగా అధికారులపైకి నెట్టడం సరైన పరిపాలన విధానం కాదు. కోర్టు ఆదేశాల కారణంగా ప్రభుత్వం తన విధాన నిర్ణయాన్ని మార్చుకోవాల్సి వస్తే, దానికి రాజకీయ నాయకత్వమే బాధ్యత వహించాలి. అధికారులను ముందుకు నెట్టి, తరువాత వారినే కోర్టు ముందు ఒంటరిగా నిలబెట్టే సంస్కృతికి ముగింపు పలకాలి. అలాగే అధికార యంత్రాంగం కూడా 'పై నుంచి ఆదేశం వచ్చింది' అనే కారణంతో చట్టబద్ధతను పక్కన పెట్టకూడదు.

ప్రభుత్వం మారుతుంది..
మంత్రులు మారతారు..
అధికారుల బదిలీలు జరుగుతాయి..
కానీ, రాజ్యాంగం మారదు..

ఇదే పరిపాలన వ్యవస్థకు అసలైన దిక్సూచి.

అధికారులపై కోర్టు ధిక్కరణ కేసులు పెరగడం కేవలం న్యాయవ్యవస్థ కఠినత్వానికి సంకేతం కాదు.. అది ప్రభుత్వ నిర్ణయాల రూపకల్పనలో, వాటి అమలులో, న్యాయపరమైన పరిశీలనలో సమన్వయ లోపం ఉందని కూడా సూచించవచ్చు. అందుకే ప్రభుత్వాలు ఒక కొత్త విధానాన్ని ఆలోచించాలి. ప్రతి కీలక విధాన నిర్ణయం తీసుకునే ముందు దాని రాజ్యాంగ, న్యాయపరమైన ప్రభావాన్ని పరిశీలించే వ్యవస్థ ఉండాలి. కోర్టు తీర్పు వచ్చిన వెంటనే దాని అమలుకు బాధ్యత వహించే అధికారి, గడువు, చర్యల ప్రణాళిక స్పష్టంగా ఉండాలి. కోర్టు ఆదేశాన్ని అమలు చేయడం సాధ్యం కాకపోతే చివరి గడువు వరకు వేచి ఉండకుండా కోర్టును ఆశ్రయించాలి. అలా చేస్తే ఒకవైపు అధికారులకు అనవసరమైన ఒత్తిడి తగ్గుతుంది. మరోవైపు బాధిత పౌరుడికి న్యాయం త్వరగా అందుతుంది. ముఖ్యంగా ప్రభుత్వ ప్రతిష్ఠ కూడా నిలబడుతుంది.

అధికారులను రక్షించాలి..
కానీ చట్టాన్ని పక్కన పెట్టి కాదు.
ప్రభుత్వ నిర్ణయాలను గౌరవించాలి.. కానీ రాజ్యాంగాన్ని ఉల్లంఘించి కాదు.
కోర్టు తీర్పులను అమలు చేయాలి.. భయంతో కాదు-రాజ్యాంగబద్ధ బాధ్యతగా.
**ప్రజాస్వామ్యంలో చివరి ప్రమాణం ఒక్కటే..**
**అందరూ 'రూల్ ఆఫ్ లా'ను పాటించాల్సిందే..!**
**ఒత్తిడిలో ఉన్నా రాజ్యాంగ విధి నిర్వర్తించాల్సిందే..!**



This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.